జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

రంగారెడ్డి | సోమవారం 28 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 231 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




# రైతుకు 'సేవలు' దూరం!

## నిర్వీర్యమవుతున్న రైతు సేవా కేంద్రాలు.. మూగబోయిన ఫైబర్ ఇంటర్నెట్ సేవలు

## స్టేషనరీ, రోజువారీ నిర్వహణ ఖర్చులకు పైసలు కరువు

## క్రమబద్ధీకరణ పేరుతో సిబ్బందిని కుదిస్తున్న కూటమి సర్కార్

ప్రజాజ్యోతి అమరావతి

విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల (పూర్వపు ఆర్‌బీకేలు) స్ఫూర్తిని దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. క్రమబద్ధీకరణ పేరిట రైతు సేవా కేంద్రాలతో (ఆర్ఎస్‌కే) పాటు సిబ్బందిని కూడా కుదించేస్తున్న ప్రభుత్వం, వాటి నిర్వహణను సైతం పూర్తిగా గాలికొదిలేసింది. పీ4, కుల గణన, పింఛన్ల పంపిణీ వంటి తమకు సంబంధం లేని అడ్డమైన సర్వేల కారణంగా తీవ్రమైన పని ఒత్తిడితో సిబ్బంది పనిచేయాల్సి వస్తోంది. గడచిన 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో ఆర్ఎస్‌కేల నిర్వహణకు రూ.35.05 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.19 కోట్లు విడుదల చేశారు. దీనిలో రూ.10.52 కోట్లు అద్దెలకే పోవడం గమనార్హం. సిబ్బందికి చివరికి కష్టమే మిగులుతోంది. మంజూరు చేసిన నిధులు గతంలో నేరుగా ప్రతి ఆర్ఎస్‌కే అకౌంట్‌లో పడేవి. ఇప్పుడు సబ్ డివిజన్ అధికారుల ఖాతాకు జమ చేస్తున్నారు. ఈ నిధులు వారు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులతో పాటు తమకు రావాల్సిన బకాయిల కోసం అడిగితే 'వస్తాయిలే..ఇస్తాం లే..' అంటూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా ఒత్తిడి తీసుకొస్తే అడ్డమైన పనులు అప్పగిస్తూ పని ఒత్తిడి పెంచుతూ వేధింపులకు గురిచేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. - మిగతా3లో

# దక్షిణ భారతంలో కూడా అధికారంలోకి వస్తాం



- తమిళనాడు, తెలంగాణలో బిజెపి ప్రభుత్వాలు వస్తాయి
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారు.
- అంబేద్కర్ ఉత్సవాలని ఎన్నో సంవత్సరాల నుంచి ఎంతో ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్నాం
- అంబేద్కర్ జయంతి అనేది ఏప్రిల్ 14వ తేదీనే కాకుండా 10 రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది.

ప్రజాజ్యోతి విజయవాడ

దక్షిణ భారతదేశంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. డా. బీఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. దీనికి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు మాట్లాడిన కిషన్ రెడ్డి.. 'దక్షిణ భారతదేశంలో కూడా అధికారంలో కి వస్తాం. తమిళనాడు, తెలంగాణలో బిజెపి - మిగతా3లో



## భారతీయుడి రక్తం మరిగిపోతుంది..

- వారికి ఊహించని శిక్ష ఖాయం: మోదీ
- ఈ దాడి సూత్రధారులకు కఠినమైన.. వారు ఊహించని శిక్ష పడుతుంది
- కశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూడలేకనే ఉగ్రవాద సూత్రధారులు దాడులు చేశారు
- ప్రపంచం మొత్తం 140 కోట్ల భారతీయులతో కలిసి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మా పోరాటానికి మద్దతుగా ఉంది.
- ప్రధాని నరేంద్ర మోదీ

# ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధానిని నిర్మిస్తాం

- ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రధాన వేదిక, పార్కింగ్ సహా వివిధ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం
- 'మన అమరావతి- మన రాజధాని' ప్రతి ఒక్కరి నినాదం కావాలి
- ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది వచ్చే అవకాశముంది
- భవిష్యత్ తరాల కోసం రాజధాని నిర్మాణం చేపడుతున్నాం




ప్రజాజ్యోతి అమరావతి

ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక, పార్కింగ్ సహా వివిధ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మన అమరావతి- మన రాజధాని' ప్రతి ఒక్కరి నినాదం కావాలన్నారు. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సీఎం గురువారం ఆహ్వానం పలకనున్నారు. మరోవైపు సభకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. వేసవి దృష్ట్యా మజ్జిగ, మంచినీళ్లు - మిగతా3లో

# ఇరాన్ నౌకాశ్రయంలో పేలుళ్లు



- 28కి పెరిగిన మృతుల సంఖ్య
- సహాయక చర్యల్లో మొత్తం నాలుగు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్
- ఇరాన్‌లోని అతిపెద్ద నౌకాశ్రయంలో ఈ పేలుడు సంభవించింది
- పేలుడు ధాటికి సమీపంలోని భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి.



## ఎనీటైమ్.. ఎనీవేర్..: ఇండియన్ నేవీ

- ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై కఠినమైన ఆంక్షలకు సిద్ధమైన భారత్..
- ఎల్‌ఓసీ(నియంత్రణ రేఖ) వెంబడి కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతోంది పాకిస్తాన్
- ఏ క్షణంలోనైనా పాకిస్తాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న క్రమంలో నేవీ సిద్ధమైంది.

# మత్స్యకారుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- చేపల వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం రెట్టింపుపై మంత్రి హర్షం
- రూ.259 కోట్లతో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి
- చేపల ఎగుమతుల్లో మనమే టాప్ : మంత్రి సవిత

ప్రజాజ్యోతి విజయవాడ

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగారాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగాచేపల వేట నిషేధ సయమంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ, మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని, మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆది నుంచి - మిగతా3లో

# ఎప్పటి నుంచి ప్లాన్ చేశార్రా..
# ఉగ్రదాడి కోసం 22 గంటలు నడిచారా

దేశం ఉలిక్కిపడేలా చేసిన పహల్గామ్ ఉగ్రవాద దాడి గురించి రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తుంది. ఏప్రిల్ 22న జరిగిన భయంకరమైన దాడిలో 26 మందికిపైగా బలిగొన్న ఉగ్రవాదులు, కోకెర్నాగ్ అడవుల నుంచి సుందరమైన బైసరన్ లోయకు వచ్చేందుకు ముందే పెద్ద ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దాదాపు 20 నుంచి 22 గంటలు అడవుల్లో నడిచి, కొండల్లో ట్రెక్కింగ్ చేస్తూ వచ్చినట్లు ఆయా వర్గాలు తెలిపాయి. దాడి సమయంలో ఉగ్రవాదులు రెండు మొబైల్ ఫోన్‌లను లాక్కున్నారని తెలిపారు. ఒకటి స్థానిక నివాసిది కాగా, మరొకటి పర్యాటకుడికి చెందినది. ఈ మారణహోమంలో నలుగురు దాడి చేసేవారు పాల్గొన్నారని వెల్లడించారు. వారిలో ముగ్గురు పాకిస్తాన్ ఉగ్రవాదులు కాగా, ఒక స్థానిక ఉగ్రవాది ఆదిల్ థోకర్ ఉన్నారు.



**దాడి సమయంలో**

2018లో ప్రారంభంలో తీవ్రవాదానికి గురైన తర్వాత హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరిన థోకర్, పలు పత్రాలను ఉపయోగించి పాకిస్తాన్‌కు వెళ్లాడు. అక్కడ అతను 2024లో కాశ్మీర్ లోయకు తిరిగి రావడానికి ముందు లష్కరే తోయిబాతో యుద్ధ శిక్షణ పొందాడు. తిరిగి వచ్చినప్పటి నుంచి థోకర్ పాకిస్తాన్ ఉగ్రవాదులకు లాజిస్టిక్‌లను అందించడం వంటి పనులను నిర్వహిస్తున్నాడు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదకరమైన మార్గదర్శిగా మారిపోయాడు. దాడి సమయంలో ఉగ్రవాదులు %ూఖ-47, వీ%4 అస్సాల్ట్ రైఫిల్స్‌ను ఉపయోగించారని ఫోరెన్సిక్ విశ్లేషణ నిర్ధారించింది. స్వాధీనం చేసుకున్న కార్ట్రిడ్జ్‌లు కీలకమైన ఆధారాలను అందిస్తున్నాయి.

**అన్ని దిశల్లోకి**

సమీపంలోని దుకాణాల వెనుక నుంచి ఇద్దరు ఉగ్రవాదులు బయటకు వచ్చి, పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో నలుగురిని కాల్చి చంపే ముందు బాధితులను కల్మా పఠించమని ఆదేశించారని చెబుతున్నారు. ఆ క్రమంలో పర్యాటకులు తప్పించుకోవడానికి అన్ని దిశల్లోకి పరిగెత్తారు. కానీ అదే సమయంలో మిగిలిన ఇద్దరు ఉగ్రవాదులు జిప్‌లైన్ ప్రాంతం దగ్గర నుంచి వచ్చి కాల్పులు జరిపారు. ఇది రక్తపాతాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారికంగా దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించింది.

**ఫోరెన్సిక్ మద్దతుతో**

ఉగ్రవాద నిరోధక సంస్థ బృందాలు బుధవారం నుంచి దాడి జరిగిన ప్రాంతంలో మోహరించి, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఆధారాల కోసం అన్వేషణను ముమ్మరం చేసింది. దర్యాప్తులో భాగంగా ఉగ్రవాదుల కార్యకలాపాల విధానాన్ని అర్థం చేసుకోవడానికి లోయలోని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణుల మద్దతుతో %చీ×ూ% అధికారులు ఇటీవలి సంవత్సరాలలో కాశ్మీర్‌లో జరిగిన అత్యంత ఘోరమైన దాడులలో ఒకటైన ఉగ్రవాద కుట్రను బట్టబయలు చేయడానికి ఆధారాల కోసం మొత్తం బైసారన్ లోయను జల్లెడ పడుతున్నారు.

# ఆలయ దర్శనం కోసం వెళ్తుండగా ప్రమాదం..
# 11 మంది మృతి, ముగ్గురికి గాయాలు

మధ్యప్రదేశ్‌లోని మందసౌర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న ఎకో వ్యాన్.. బైక్‌ను ఢీకొట్టి అనుకోకుండా వెళ్లి బావిలో పడిపోయింది. అదే సమయంలో గమనించి వారిని కాపాడటానికి బావిలోకి దిగిన వ్యక్తి కూడా తిరిగి రాలేదు. ఇప్పటివరకు ఈ ఘటనలో 11 మంది మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. మాందసౌర్ జిల్లాలోని నారాయణగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో బైక్ రైడర్, కారు ప్రయాణీకులు సహా 11 మంది మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. కారులో ఉన్న వారందరూ రత్లాంకు చెందినవారని చెబుతున్నారు.



**సాయం కోసం వెళ్లి..**

సమాచారం అందుకున్న మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా, డీఐజీ మనోజ్ కుమార్ సింగ్ కూడా ఘటనా స్థలానికి చేరుకుని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మంద్‌సౌర్ జిల్లాలోని నారాయణ్‌గఢ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని బుధ తకర్వత్ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పిన ఎకో వ్యాన్ మొదట బైక్‌ను ఢీకొట్టి, ఆపై తెరిచి ఉన్న బావిలో పడిపోయింది. అదే సమయంలో వారిని రక్షించడానికి బావిలోకి దిగిన దౌర్వాడి నివాసి మనోహర్ సింగ్ అనే యువకుడు కూడా గ్యాస్ లీకేజీతో ఊపిరాడక మరణించాడు. అబాఖేడి నివాసి బైక్ రైడర్ గోబర్ సింగ్ మృతి చెందినట్లు అక్కడికక్కడే నిర్ధారించారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి, అతన్ని రక్షించడానికి బావిలోకి దిగిన ఒక గ్రామస్తుడు కూడా ప్రాణాలు కోల్పోయారు.

**ఆలయ దర్శనం కోసం వెళ్లి..**

ఉజ్జయిని జిల్లాలోని ఉన్హెల్ నుంచి నీముచ్ జిల్లాలోని మానస ప్రాంతంలో ఉన్న అంతర్రీ మాత ఆలయాన్ని సందర్శించడానికి వెళ్తున్న వ్యాన్‌లో 11 మందికి పైగా ఉన్నారు. ప్రమాదంలో గాయపడిన మూడేళ్ల బాలికతో సహా నలుగురిని సురక్షితంగా రక్షించి మాండ్‌సౌర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా, కలెక్టర్ అదితి గార్గ్, ఎస్పీ అభిషేక్ ఆనంద్, అదనపు ఎస్పీ గౌతమ్ సోలంకి, ఎస్డీఓపీ నరేంద్ర సోలంకి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి. డ్రైవర్ వ్యాన్ పై నియంత్రణ కోల్పోయిన క్రమంలోనే ఇలా జరిగిందని అధికారులు చెబుతున్నారు.

# కర్రెగుట్టలో మావోయిస్టుల గుహ..
# 1000 మంది ఉండేలా నీటి సౌకర్యం..

**చర్ల:** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య ఆపరేషన్ కర్రె గుట్టల్లో భాగంగా భద్రతా బలగాలు కీలక ముందడుగు వేశాయి. ఐదు రోజుల సెర్చ్ ఆపరేషన్‌లో తాజాగా మావోయిస్టుల కీలక స్థావరమైన బంకర్‌ను బలగాలు గుర్తించాయి. ఈ గుహ గురించి కీలక విషయాలను వెల్లడించాయి. వివరాల ప్రకారం.. కర్రెగుట్టలో మావోయిస్టుల బంకర్(గుహ)ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఇక, ఆ గుహలో దాదాపు 1000 మంది సురక్షితంగా ఉండేలా ప్రదేశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. గుహలో నీటి సౌకర్యం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, భద్రతా బలగాల రాకను పసిగట్టిన మావోయిస్టులు.. అక్కడి నుంచి మకాం మార్చినట్టు సమాచారం. మరోవైపు.. కర్రె గుట్టలో అనేక గుహలు ఉండటంతో భద్రతా బలగాలకు సవాళ్లు ఎదరవుతున్నాయి. తాజాగా బంకర్(గుహ)కు సంబంధించి వీడియోలను భద్రతా బలగాలు విడుదల చేశాయి. ఇదిలా ఉండగా.. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు ఐదో రోజు కూంబింగ్ కొనసాగించాయి.



సాయంత్రం 4 గంటలు కాగానే చీకటి పడటం.. 5 అడుగుల దూరంలో మనిషి కూడా కనిపించనంత దట్టమైన అడవి ఉండటంతో ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు తమకు అత్యంత సురక్షితంగా భావిస్తారు. ఇలాంటి చోట ఆపరేషన్ బలగాలకు కత్తిమీద సాముగా మారింది. గల్గం అడవుల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఒక డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు కాగా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ఇరాన్ నౌకాశ్రయంలో పేలుళ్లు..

ఇరాన్‌లోని అత్యాధునిక షాహిద్ రజాయీ నౌకాశ్రయంలో శనివారం సంభవించిన భారీ పేలుళ్లలో మృతిచెందిన వారి సంఖ్య 28కి పెరిగింది. ఈ ఘటనలో సుమారు 750 మందికిపైగా గాయపడ్డారు. పేలుడులో పెద్దఎత్తున చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. దాదాపు 10 గంటలకుపైగా శ్రమించి మంటలను ఆర్పాల్సి వచ్చింది. సహాయక చర్యల్లో మొత్తం నాలుగు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ పాల్గొన్నాయని హెర్మోజ్గాన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ చీఫ్ ముక్తార్ సలాహ్‌షార్ చెప్పారు. చాలా కంటెయినర్లు పేలడంవల్ల ఈ దుర్ఘటన జరిగిందని హెర్మోజ్గాన్ ప్రావిన్స్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ అథారిటీ చీఫ్ మెహర్దద్ హస్సన్ జడేహ్ చెప్పారు. గాయపడిన వారు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇరాన్‌లోని అతిపెద్ద నౌకాశ్రయంలో ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి సమీపంలోని భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఒక భవనం నేలకూలింది. దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. పేలుడు నేపథ్యంలో ఘటనాస్థలానికి సమీపంలో ఉన్న పాఠశాలలు, కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేశారు. అయితే ఇది దాడి కాదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇప్పటికే స్పష్టంచేశారు. పోర్టులో నిల్వ ఉన్న కొన్ని కంటెయినర్లు పేలడంతో ప్రమాదం జరిగిందని స్థానిక విపత్తు నిర్వహణ అధికారి మెహర్దాద్ హసన్జాదే చెప్పారు. ఈ ఘటనకు అసలు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. పేలుళ్లకు కారణం తెలుసుకోవడం కోసం దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. అయితే క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

## ఎనీటైమ్.. ఎనీవేర్..: ఇండియన్ నేవీ

**న్యూఢిల్లీ:** ఎనీటైమ్(ఎప్పుడైనా).. ఎనీవేర్(ఎక్కడైనా).. ఎనీహౌ(ఏమైనా సరే) సందేశం పంపింది ఇండియన్ నేవీ. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై కఠినమైన ఆంక్షలకు సిద్ధమైన భారత్.. ఆ మేరకు చర్యలను వేగవంతం చేసింది. అయితే పాకిస్తాన్ మాత్రం సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. భారత ఆర్మీని రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగంగా ఎల్ఓసీ(నియంత్రణ రేఖ) వెంబడి పాకిస్తాన్ పదేపదే కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఈ దాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొడుతూ పాకిస్తాన్ దుశ్చర్యలపై ఓ కన్నేసి ఉంచింది. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ఇంకా ఏమైనా హద్దు మీరితే గట్టిగానే బదులివ్వడానికి భారత్ సిద్ధమైంది. దీనిలో భాగంగా భారత యుద్ధనౌకలు అరేబియా సముద్రంలో సైనిక విన్యాసాలను ఆరంభించాయి. ఏ క్షణంలోనైనా పాకిస్తాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న క్రమంలో నేవీ సిద్ధమైంది. లాంగ్ రేంజ్ కచ్చితమైన దాడులకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు నేవీ స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాలను కాపాడటానికి తాము యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇండియన్ నేవీ.. పాకిస్తాన్ కు హెచ్చరికలు పంపింది. ఎనీటైమ్.. ఎనీవేర్.. ఎనీహౌ అంటూ నేవీ తన ' ఎక్స్' ద్వారా ఒక మెస్సేజ్ ను పంపింది. గత మంగళవారం(ఏప్రిల్ 22వ తేదీ) పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో టూరిస్టులు 26మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ సహకారంతోనే ఉగ్రదాడులు జరుగుతున్నాయని పసిగట్టిన భారత్.. అందుకు అనుగుణంగా స్ట్రాంగ్ మెస్సేజ్ పంపింది. సింధూ జలాలను నిలిపివేతతో పాటు పాకిస్తాన్ జాతీయులు దేశం నుంచి విడిచి వెళ్లిపోవాలని ఆంక్షలు విధించింది.



## సీఎం సార్.. మీరు నిజంగా 'పాకిస్తాన్ రత్న'



**బెంగళూరు:** పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సిన అవసరం ఇప్పుడు లేదని. భారత్ శాంతిప్రియ దేశం. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు చనిపోవడానికి దేశ అంతర్గత భద్రత, ఇంటెలిజెన్స్ శాఖల వైఫల్యమే కారణమని సిద్ధరామయ్య ఆరోపించారు. వేలాది మంది పర్యాటకులు సంచరించే స్థలంలో వారికి తగిన భద్రతను కల్పించాల్సిందన్నారు. ఆ భద్రత లేనందునే ఈ ఘోరం జరిగిందన్నారు. భద్రత ఉందనుకొని ప్రజలు కశ్మీరుకు వెళ్లి మృత్యువాత పడ్డారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకున్నా పోయిన ప్రాణాలను వెనక్కు తెచ్చివ్వగలరా అని ప్రధాని మోదీని విమర్శించారు. సిద్ధరామయ్య.

**మీరు నిజంగా 'పాకిస్తాన్ రత్న'**

దీనిపై కర్ణాటక బీజేపీ తీవ్రంగా మండిపడింది. పాకిస్తాన్ లో , పాకిస్తాన్ బోర్డర్ లో సిద్ధరామయ్య పేరు మారుమ్రోగుతోంది. ' మీరు పాకిస్తాన్ రత్న' కర్ణాటక బీజేపీ ధ్వజమెత్తింది. మన దేశానికి తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గురించి ప్రస్తావించిన బీజేపీ చీఫ్ బీవై విజయేంద్రన్... పాకిస్తాన్ కు అనుకూలంగా సింధు జల ఒప్పందంపై సంతకం చేసినప్పుడు పాకిస్తాన్ చాలా సంతోషం ఉంది. కాబట్టే అప్పుడు రావల్పిండి వీధ/ల్లో నెహ్రూను ఓపెన్ జీప్ లో తీసుకెళ్లారు. పాకిస్తాన్ లో ఓపెన్ జీప్ లో తిప్పబడే భారత దేశ తదుపరి రాజకీయ నేత మీరు అవుతారా సిద్ధరామయ్య అవుతారా? అని ప్రశ్నించారు బీజేపీ చీఫ్

**ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా?**

ఒక సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా అంటూ కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప విమర్శించారు. ' మనదేశం అంతా ఒక్కటిగా ఉండాల్సిన సమయంలో ఈ తరహ మాటాలేమిటి.. అసలు వాస్తవ పరిస్థితులు ఏమిటో అర్థం చేసుకోవాలి. మీకు సీఎంగా ఇచ్చే ఫేర్ వెల్ పార్టీ కాదు ఇది. మీ వ్యాఖ్యలు కచ్చితంగా అభ్యంతరకరమే. మీరు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు యడ్యూరప్ప.

## భారతీయుడి రక్తం మరిగిపోతుంది..



**ఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లో పహల్గాం దాడి ఘటన తర్వాత ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ దాడి సూత్రధారులకు కఠినమైన.. వారు ఊహించని శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే, కశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూడలేకనే ఉగ్రవాద సూత్రదారులు దాడులు చేశారని మోదీ ఆరోపించారు. ప్రధాని మోదీ ఈరోజు మన్ కీ బాత్‌లో మాట్లాడుతూ..'కశ్మీర్‌ను నాశనం చేసేందుకే ఉగ్రవాదుల దాడి జరిగింది. కశ్మీర్‌లో అభివృద్ధి వేగం పెరిగింది, టూరిస్టులు సంఖ్య పెరిగి ఆదాయం వృద్ధి చెందింది. దీన్ని ఓర్వలేక దాడులు చేస్తున్నారు. ఈ దాడి ఘటన తర్వాత ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుంది. ప్రపంచం భారతదేశం పక్షాన నిలుస్తోంది. ప్రపంచం మొత్తం 140 కోట్ల భారతీయులతో కలిసి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మా పోరాటానికి మద్దతుగా ఉంది. బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని హామీ ఇస్తున్నాను. ఈ దాడి సూత్రధారులకు కఠినమైన, వారు ఊహించని శిక్ష పడుతుంది. భారత్‌లోని ప్రజల ఆగ్రహం ప్రపంచం మొత్తంలో ప్రతిఫలిస్తోంది. ప్రపంచ నాయకులు ఫోన్ చేసి, లేఖలు రాసి, సందేశాలు పంపి తమ సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని గట్టిగా ఖండించారు. మనం సంకల్పాన్ని బలపర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మన సంకల్పాన్ని బలోపేతం చేయాలి. దేశం ఇప్పుడు ఏకతాటిపై మాట్లాడుతోంది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఏకతా శక్తి అవసరం. ఉగ్రవాదానికి ప్రోత్సాహం ఇస్తున్న శక్తులు కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనుకుంటున్నాయి. దేశం ఐకమత్యమే మన విజయానికి ఆధారం. పహల్గాంలో జరిగిన దాడి ఉగ్రవాదుల మూర?త్వాన్ని, నిస్సహాయతను చూపిస్తుంది. 22 ఏప్రిల్ పహల్గాం ఉగ్రదాడి ప్రతీ భారతీయుడి మనసును కలచివేసింది. ప్రతీ రాష్ట్రం, ప్రతీ భాషకు చెందిన వారు బాధిత కుటుంబాల కష్టాన్ని తలచుకుంటున్నారు. ప్రతీ భారతీయుడి గుండె ఉగ్ర దాడి దృశ్యాలను చూసి రగులుతోంది అంటూ చెప్పుకొచ్చారు.

# యాప్‌లతో ఆర్థిక నేరాలకు పాల్పడుతోన్న ముఠా గుట్టు రట్టు



**విశాఖపట్నం :** లోన్ యాప్‌ల ద్వారా ఆర్థిక నేరాలకి పాల్పడుతోన్న ముఠా గుట్టును విశాఖపట్నం నగర పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి ఇన్వెస్టమెంట్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడుతో సహా 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే రూ.60 లక్షల విలువైన క్రిఫ్టో కరెన్సీని పోలీసులు సీజ్ చేశారు. ఆదివారం విశాఖపట్నంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విలేకర్లతో ఈ విషయాలను వివరించారు. రూ.2 వేలు లోన్ యాప్‌లో అప్పు తీసుకున్న నరేంద్రను వేధించిన కేసులో పురోగతి సాధించినట్లు ఆయన తెలిపారు. నరేంద్ర భార్య ఫోటోలను మార్ఫింగ్ చేసి సైబర్ నేరగాళ్లు బంధువులకు పంపారన్నారు. ఆ అవమాన భారంతో పెళ్లయిన 40 రోజులకు నరేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. ఈ లోన్ యాప్‌ను ఈ ముఠా.. పాకిస్థాన్ కేంద్రంగా నడుపుతోనట్లు గుర్తించామని తెలిపారు. దీని ద్వారా దాదాపు రూ.200 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. సుమారు భారత్ నుంచి 9 వేల మంది బాధితులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు గుర్తించామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముఠా నుంచి 18 మొబైల్ ఫోన్లు,ఒక ల్యాప్ టాప్,54 సెల్ ఫోన్ సిమ్ములు స్వాధీనం చేసుకున్నామని నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. విశాఖపట్నం మహారాణి పేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన ఎస్ నరేంద్ర ఆన్‌లైన్ లోన్ యాప్‌లో కొంత మొత్తంలో నగదు అప్పు తీసుకున్నాడు. రూ.2 వేలు మినహా మిగిలినదంతా చెల్లించాడు. కానీ ఆ రూ.2 వేల కోసం అతడిని లోన్ యాప్ నిర్వాహకులు వేధించడం ప్రారంభించారు.అతడి భార్య ఫోన్‌కు మార్ఫింగ్ ఫొటోలు పంపి నరేంద్రతో వెంటనే నగదు కట్టించాలని, లేకుంటే మరిన్ని ఫొటోలు పంపిస్తామని బెదిరించారు. హతాశురాలైన ఆమె ఏం జరిగిందని భర్తను నిలదీయగా.. లోన్ యాప్ వాళ్లకు రెండు వేలు చెల్లించాలని చెప్పాడు. తమ వద్ద ఉన్న రూ.2 వేలు వెంటనే చెల్లించేశారు. అప్పటికే యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ ఫొటోలను నరేంద్ర ఫోన్ కాంటాక్ట్ లిస్టులో ఉన్న వాళ్లందరికీ పంపించేశారు. దాన్ని తీవ్ర అవమానంగా నరేంద్ర భావించాడు. భార్య నిద్రలో ఉండగా.. అతడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేంద్ర.. ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం జరిగి 40 రోజులైంది. దంపతులిద్దరూ చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

# మత్స్యకారుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు మేలు జరుగుతోందన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు. మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సయమంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలను రెట్టింపు చేస్తూ రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లను అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. 2014లో తొలిసారిగా మత్స్యకారులకు ఆర్థియం అందించారన్నారు. 2014-19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం ఆనాటి చంద్రబాబునాయుడి ప్రభుత్వం రూ.788 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ నిధులతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా



అందజేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చేపల వేట సమయంలో ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. చేపల వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల అభివృద్ధికి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందన్నారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా ఎటువంటి మేలు జరగలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

చేపల ఎగుమతుల్లో మనమే టాప్

చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందు వరుసలో ఉందని మంత్రి సవిత వెల్లడించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఏపీ నుంచే ఉంటోందన్నారు. మత్స్య సంపద ఎగుమతుల్లో 32 శాతం ఏపీ నుంయి జరుగుతోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

# రైతుకు 'సేవలు' దూరం!

-మొదటిపేజీ తరువాయి

మరొక వైపు పాడిపంటలు మ్యాగజైన్ కోసం కూడా లక్ష్యాలను నిర్ధేశిస్తుండడంతో వాటి చందాల కోసం కూడా తమ జేబులకే చిల్లుపడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నాడు పారదర్శకం

సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో 10,778 రైతు సేవా కేంద్రాల్లో 15,667 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అద్దెలతో పాటు ఇంటర్నెట్, విద్యుత్ బిల్లులకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసేవారు. గతేడాది ఏప్రిల్ నాటికి అద్దెల రూపంలో రూ.33 కోట్లు, స్టేషనరీ కోసం రూ.3 కోట్లు, విద్యుత్ బిల్లుల కోసం రూ.12 కోట్లు చెల్లించారు. అంతేకాదు విద్యుత్ బిల్లులకు అవసరమైన బడ్జెట్‌ను విద్యుత్ శాఖకు కేటాయించేలా ఉత్తర్వులిచ్చారు. హై స్పీడ్ ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయాన్ని సమకూర్చేందుకు రూ.23 కోట్లు ఖర్చు చేసారు. మరొక వైపు మట్టినమూనాలు, ఈ పంట నమోదు, ధాన్యం కొనుగోలు, ఎరువుల అమ్మకాలు, పంట కోత ప్రయోగాలు ఇలా ప్రతీ పనికి నిర్ధేశించిన ప్రోత్సాహకాలను ఎప్పటికప్పుడు నేరుగా వారి ఖాతాలకే జమ చేసేవారు.

### నేడు లోపభూయిష్టం..

రైతు భరోసా కేంద్రాలు%-% ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా (ఆర్ఎస్కే) మార్చేందుకు చూపిన ఉత్సాహం వాటి నిర్వహణపై కూటమి ప్రభుత్వం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

‘ ప్రతిరోజూ ఆర్ఎస్కేలను శుభ్రం చేసేందుకు, నీటి వసతి కల్పించేందుకు స్టేషనరీకి, ఇంటర్నెట్ చార్జీలు, మైనర్ రిపేర్లు తదితర ఖర్చుల కోసం ప్రతీ నెలా రూ.2,000 చెల్లించేవారు.



‘ఇవి కాకుండా వ్యక్తిగతంగా సిబ్బందికి ఒక్కో మట్టి నమూనాకు రూ.50, టన్ను యూరియాకు రూ.50, డీఏపీ, ఇతర ఎరువులకు రూ. 100 చొప్పున చెల్లించేవారు.

‘ దీనితోపాటు ఒక్కొక్క పంట కోత ప్రయోగానికి రూ.150 చొప్పున ఇచ్చేవారు.

‘ ఆర్ఎస్కే పరిధిలో ప్రతీ సీజన్‌లో నాలుగు పంటకోత ప్రయోగాలు జరుగుతుంటాయి. పొలంబడుల నిర్వహణకు రూ.20,514 ఖర్చు అయ్యేది. ధాన్యం కొనుగోలు నిర్వహణ ఖర్చు నిమిత్తం ఒక్కొక్క క్లస్టర్‌కు సుమారు రూ.5 వేలకు పైగా చెల్లించేవారు.

‘ కానీ గడిచిన సీజన్‌కు సంబంధించి ఏ ఉద్యోగికి పైసా కూడా జమ కాలేదు. కేంద్ర నిధులతో చేపట్టే సామూహిక ఎలుకల నివారుణకు ఉపయోగించే గ్లౌవ్స్, కత్తెర, ప్యాకింగ్ మెటీరియల్‌కే కాదు చివరికి బ్యానర్ తయారీకి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదంటున్నారు.

‘కేవలం ఆర్ఎస్కేల నిర్వహణ కోసం ప్రతీ నెలా సగటున రూ.2,500 నుంచి రూ.3వేల వరకు తమ జీతాల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.

‘ ఇక ఆర్ఎస్కేల్లో ఎక్కడా ఇంటర్నెట్ సేవలు లేనే లేవు. ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్లు అలంకార ప్రాయంగా మారిపోయాయి.

‘ కరెంట్ బిల్లుల చెల్లింపులు పూర్తిగా మరిచి పోయారు. 25%-%30 శాతం ఆర్ఎస్కేలు అంధకారంలో ఉన్నాయని సమాచారం. విద్యుత్ బకాయిల బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి.

## పీఏపై ఆరోపణలు.. స్పందించిన ఎమ్మెల్యే



**కడప,ఏప్రిల్ 27:** కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి పీఏ వాహిద్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి ప్రకటించారు. వాహిద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్యే మాధవి రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే పీఏ వాహిద్‌పై ఆరోపణలు రావడంతో.. వారు వెంటనే స్పందించారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..**

ఉద్యోగం పేరుతో ఒంటరి మహిళను మోసం చేసి కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి పిఏ వాహిద్ రెండవ వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఉద్యోగంతోపాటు నగదు ఇస్తానని నమ్మించి వివాహం చేసుకున్నాడు. ఇలా మరో ముగ్గురు అమ్మాయిలను ఎమ్మెల్యే పీఏ ట్రాప్ చేసినట్లు బాధితులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఓ బాధితురాలి సోదరుడు తమకు న్యాయం చేయాలని వాహిద్‌ను కోరాడు. ఈ నేపథ్యంలో అతడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తన సోదరుడిపై దాడి చేశాడంటూ బాధితురాలి ఆరోపించింది. దీంతో ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లినా.. తమకు న్యాయం జరగలేదని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. దాంతో వారు ఎమ్మెల్యే మాధవి రెడ్డి నివాసానికి బాధితులు వెళ్లారు. ఆ క్రమంలో వాహిద్ వల్ల తమంతా బాధితులుగా మారామని ఎమ్మెల్యే ఎదుట సదరు మహిళలు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవీ రెడ్డితోపాటు ఆమె భర్త టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి పై విధంగా స్పందించారు. మరోవైపు ఎమ్మెల్యే కార్యాలయంలో తనను చెల్లిగా వాహీద్ పరిచయం చేశాడని సదరు మహిళ వివరించింది.

## ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధానిని నిర్మిస్తాం

-మొదటిపేజీ తరువాయి

పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది వచ్చే అవకాశముందని సీఎం చెప్పారు. భవిష్యత్ తరాల కోసం రాజధాని నిర్మాణం చేపడుతున్నామన్న ఆయన.. అమరావతి నిర్మాణ పునఃప్రారంభంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. “ ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధానిని నిర్మిస్తాం. అమరావతి నిర్మాణం రాష్ట్రానికి నవోదయం. రాష్ట్ర చరిత్రలో మే 2 గొప్ప మలుపు అవుతుంది. అమరావతిని దెబ్బతీయాలని గత ప్రభుత్వం అనేక కుట్రలు, దాడులు చేసింది. అనేక సవాళ్లు, కష్టాలను తట్టుకొని అమరావతి నిలబడింది. అద్భుత రాజధాని నిర్మించి.. విధ్వంసకారులకు గట్టి సమాధానం ఇస్తాం. అమరావతి.. ఏపీ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష. ప్రధాని మోదీ కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారు. ప్రధానితో జరిగిన భేటీలో పలు సూచనలు చేశారు.” అని చంద్రబాబు అన్నారు.

**అందరి భాగస్వామ్యంతో రాజధాని పునర్నిర్మాణం: నారాయణ**

అందరి భాగస్వామ్యంతో రాజధాని పునర్నిర్మాణం చేపడుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 8 మార్గాలు గుర్తించామన్నారు. అదనంగా మరో 3 రూట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. “ పార్కింగ్ కోసం 11 ప్రాంతాలు గుర్తించాం. మే2న సాయంత్రం వాతావరణంలో మార్పులుండే అవకాశం ఉంది. వర్షం వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. మే 2న ప్రధాని మోదీ రోడ్‌షో కుదరదని భావించాం. కారులో నుంచే మోదీ అభివాదం చేస్తూ.. వేదికపైకి వస్తారు” అని నారాయణ తెలిపారు. మే 2న అమరావతిలో రూ.లక్ష కోట్లకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాజధాని అమరావతిలో పనుల పునఃప్రారంభానికి సూచికగా ప్రధాని మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారు. వెలగపూడి సచివాలయం వెనుక 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రాజధాని పనుల పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని సభ కోసం మూడు వేదికలు సిద్ధం చేస్తున్నారు.

## 'దక్షిణ భారతంలో కూడా అధికారంలోకి వస్తాం'



-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వాలు వస్తాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారు. అంబేద్కర్ ఉత్సవాలని ఎన్నో సంవత్సరాల నుంచి ఎంతో ప్రతిస్టాత్మకం గా నిర్వహిస్తున్నాం. అంబేద్కర్ జయంతి అనేది ఏప్రిల్ 14వ తేదీనే కాకుండా 10 రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. అంబేద్కర్ దళిత సామాజిక వర్గంలో జన్మించి అనేక ఒడిదుడుకులు ఎదురుకున్నారు. విద్యార్థి దశ నుంచి ఎన్నో అవమానాలకి గురయ్యారు. ఒక మేధావిగా ఆయన ఎదిగి అనేక పోరాటాలు చేశారు. బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం నింపారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో అంబేద్కర్ కీలక పాత్ర వహించారు. అంబేద్కర్ ఎంపీ గా పోటి చేస్తే ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేసారు. కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పి కొట్టి పార్లమెంట్ కి పంపించేలా మేధావులు కీలక పాత్ర వహించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహరించింది. రాజకీయ స్వలాభం కోసం ఆనాడు కాంగ్రెస్ పాలన ఉండేది. అడుగడుగునా అంబేద్కర్ ని అవమానపరిచేలా కాంగ్రెస్ చేసింది. అంబేద్కర్ ఒక మేధావి అయినప్పడికి అనేక రకాలుగా కాంగ్రెస్ అవమానపరిచింది. మొదటి సారి ప్రధానిగా మోదీ ఎన్నిక అయినప్పుడు అంబేద్కర్ కి నివాళులు అర్పించి పార్లమెంట్ లోకి అడుగుపెట్టారు. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తి తోనే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుంది. రాజ్యాంగాన్ని మరింత శక్తీవంతంగా ఉంచాలని మోదీ ప్రభుత్వం పని చేస్తుంది. రాజ్యాంగానికి గౌరవం ఉండేలా మోదీ ప్రభుత్వం ఉంటుంది. అంబేద్కర్ అంతిమ సంస్కారం చేసిన స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం. అంబేద్కర్ ఉన్న ప్రదేశాలని పంచ తీర్థ పేరుతో నిర్మాణం చేపట్టాం. పార్లమెంట్ లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టి గౌరవించిన ఘనత ప్రధాని మోదీది. దేశానికి సేవ చేసిన అంబేద్కర్ కి కాంగ్రెస్ భారతరత్న ఇవ్వకుండా అవమానపరిచింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ కి భారత్ రత్న ఇచ్చింది. అంబేద్కర్ సిద్ధాంతం, స్ఫూర్తి తో ప్రధాని మోదీ పని చేస్తున్నారు' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# ఇంకా ఆ పీడకలే

జమ్ము కశ్మీర్ లో ప్రసిద్ధ పర్యటక ప్రాంతమైన పహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో 26 మంది పర్యటకులు చనిపోవడంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు పెరిగాయి.జమ్ము కశ్మీర్ నుంచి తిరుగు పయనమైన పర్యటకుల సంఖ్య పెరిగిపోయింది. పర్యటకులను శ్రీనగర్ విమానాశ్రయానికి చేర్చే టాక్సీలు బారులు తీరుతున్నాయి. హైవేలపై కూడా తిరుగు ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతోంది."మాకు భయంగా ఉంది. టెర్రరిస్టులు ఎక్కడ ఉన్నారో, తర్వాత ఏం జరుగుతుందో తెలియదు" అని గౌతమ్ అనే టూరిస్ట్ చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో పర్యటించేందుకు ఆయన బోలెడు ప్రణాళికలతో వచ్చారు. కానీ ఇప్పుడాయన ఇంటికి తిరిగి వెళ్లిపోయే హడావుడిలో ఉన్నారు.జమ్ము కశ్మీర్ దశాబ్దాలుగా హింసకు కేంద్రంగా ఉన్నప్పటికీ, పర్యటకుల మీద దాడులు జరగడం చాలా అరుదు."ఇటీవలి సంవత్సరాలలో సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో ఇది చాలా పెద్దది" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. 1947లో బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ రెండు దేశాలు ముస్లింలు మెజార్టీగా ఉన్న కశ్మీర్ కోసం రెండు యుద్ధాలు చేశాయి. 1980, 90లలో భారతదేశ పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో చెలరేగిన అసంతృప్తి తిరుగుబాటుకు దారి తీసింది. దీనికి పాకిస్తాన్ నిధులు అందిస్తోందని భారతదేశం ఆరోపిస్తోంది. ఈ సంఘర్షణలో వేల మంది చనిపోయారు. అయితే ఇటీవలి సంవత్సరాలలో హింస తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది.2004- 2014 మధ్య 7217 టెర్రరిస్ట్ సంఘటనలు జరిగాయని, అయితే 2014 నుంచి 2024 మధ్య వాటి సంఖ్య 2242కి తగ్గింది" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చెప్పారు.సంప్రదాయంగా ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద చోదకశక్తిగా ఉన్న పర్యటకం, ఇటీవల బాగా పుంజుకుంది.2023లో జమ్ము కశ్మీర్‌ను 2 కోట్ల మంది పర్యటకులు సందర్శించారని భారత పర్యటక శాఖ తెలిపింది. కోవిడ్‌కు ముందున్న సంఖ్యతో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ.అయితే పహల్గాం దాడి తర్వాత ఈ పరిస్థితికి ముప్పులా కనిపిస్తోంది."అంతా అయిపోయింది. నాకు కన్నీళ్లు వస్తున్నాయి" అని పహల్గాంలో శాలువాలు అమ్ముకునే షకీల్ అహ్మద్ చెప్పారు."మా జీవితం అంతా పర్యటకుల మీద ఆధారపడి ఉంది. నేను బ్యాంకు నుంచి అప్పు తీసుకుని ఈ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు నా వస్తువులను కొనుక్కోవడానికి ఎవరూ లేరు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."పాశవికమైన, క్రూరమైన దాడి. ఇది కశ్మీర్‌కు, ఈ ప్రాంత పర్యటక పరిశ్రమకు చెడ్డవార్త " అని స్థానిక హోటల్ వ్యాపారి జావెద్ అహ్మద్ చెప్పారు.అహ్మద్ హోటల్‌లో రూములు జూన్ వరకు బుక్ అయ్యాయి. అయితే ఇప్పుడీ సంఘటన కారణంగా పర్యటకులు రావడం ఆగిపోయినా, బుకింగ్స్ రద్దు చేసుకున్నా, తన వ్యాపారం దెబ్బ తింటుందని ఆయన ఆందోళన చెందుతున్నారు.జమ్ము కశ్మీర్‌లో పర్యటక రంగానికి ఇది కీలకమైన సీజన్. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించే స్వర్గధామంలా ఈ ప్రాంతాన్ని పరిగణిస్తుంటారు. పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా దేశం నలుమూలల నుంచి కుటుంబసమేతంగా ఇక్కడకు వస్తుంటారు.అయితే ఈ సెలవుల సీజన్ భిన్నంగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే కశ్మీర్ లోయ ఇప్పుడు భద్రతా చట్రంలో చిక్కుకుపోయింది.ప్రస్తుతం శ్రీనగర్‌లోని పర్యటకులలో భయం ఏర్పడిందని, త్వరలో వెళ్లాలనుకుంటున్న వారిలో ఆగ్రహం, భయం ఉన్నాయని ముంబయి కేంద్రంగా గ్రూప్ టూర్స్‌ను నిర్వహించే అభిషేక్ హాలిడేస్ సంస్థ అధిపతి అభిషేక్ సంసారే చెప్పారు.బుకింగ్‌లను రద్దు చేయాలని అనేకమంది ఫోన్లు చేస్తున్నారు" అని ఆయన చెప్పారు.ఈ దాడిని ప్రపంచ దేశాల నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పారు.బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ కశ్మీరీలు నిరసన ప్రదర్శనలు చేశారు.పహల్గాం లైన్ ఆఫ్ కంట్రోల్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత ఈ ప్రాంతంలో పర్యటక రంగానికి ఊపు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. 2023లో జీ ట్వంటీ టూరిజం వర్క్‌షాప్ గ్రూప్ సమావేశానికి శ్రీనగర్ ఆతిథ్యమిచ్చింది. ఈ సమావేశానికి అనేక మంది విదేశీ అతిథులు హాజరయ్యారు.ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత తొలిసారి 2024లో శ్రీనగర్‌లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్థానికంగా వ్యవసాయ, పర్యటక రంగాల అభివృద్ధికి 6,400 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు. "అభివృద్ధిలో జమ్మూ కశ్మీర్ కొత్త ఎత్తుల్ని తాకుతోంది. ఎందుకంటే అది ఇప్పుడు స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత స్వేచ్ఛ వచ్చింది" అని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 తొలగించిన తొలినాళ్లలో, పరిస్థితులు ఇంకా చక్కబడకముందే పర్యటకుల సంఖ్య పెరుగుతోందని కొందరు ఆందోళన చెందారు."పర్యటకం అంటే సాధారణ స్థితి కాదు. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సూచిక. సాధారణ స్థితి అంటే భయం లేకపోవడం. టెర్రరిజం లేకపోవడం, ఉగ్రవాదుల దాడులు తగ్గడం, ప్రజాస్వామిక పాలన వల్ల కశ్మీర్ ప్రస్తుతం సాధారణంగా ఉంది" అని ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2022లో అన్నారు.2024లో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.పహల్గాం దాడి ఘటనపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. "టెర్రరిస్టుల దాడి తర్వాత పర్యటకులు కశ్మీర్ లోయ నుంచి వెళ్లిపోవడం చూస్తుంటే హృదయ విదారకంగా ఉంది" అని ఆయన అందులో పేర్కొన్నారు.పచ్చని పచ్చిక బయళ్లతో ప్రకృతి సౌందర్యంతో పర్యటకులకు మరపురాని అనుభూతిని పంచుతుంది. సినిమా నిర్మాతలకు చాలా ఇష్టమైన ప్రాంతం కూడా.హింసాత్మక దాడులు చాలా తక్కువ. అలాంటిది మంగళవారం జరిగిన దాడి అనేక మందిని నిర్ఘాంత పోయేలా చేసింది."క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఏంటో ఇప్పుడు దేశం మొత్తానికి తెలిశాయి" అని శ్రీనగర్‌లో కశ్మీర్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ నాయకత్వంలో నిరసన ప్రదర్శన చేసిన తర్వాత మెహబూబ్ హుస్సేన్ మీర్ చెప్పారు."ప్రత్యేక ప్రతిపత్తి తొలగించడానికి ముందు, తొలగించిన తర్వాత కూడా దాడులు జరుగుతున్నాయి. ఇక్కడ ఎప్పుడూ అశాంతి రాజ్యమేలుతుంది. దీని వల్ల స్థానికులే బాధ పడుతున్నారు. దీనికి ప్రభుత్వం పరిష్కారం కనుక్కోవాలి. లేకపోతే మా జీవితాలు ఊగిసలాడుతూనే ఉంటాయి" అన్నారు.

# నీతికథలతో పిల్లల్లో మనోవికాసం !



కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే "అనగనగా ఒక రాజు" అంటూ నీతి కథలు చెప్పేవాళ్లు. అమ్మ, నాన్న, తాత, నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, నాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపే వారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆయా కుటుంబాల్లోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే ప్రయత్నాలు చేసేవారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న "జాతీయ కథలు చెప్పే దినోత్సవం" లేదా "నేషనల్ టెల్ ఏ స్టోరీ"ని పాటించడం ఆనవాయితీగా మారింది.కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవం నుంచి తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న పిల్లలు కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకోవడం ఒక సదాచారమే కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన "జాతీయ కథలు చెప్పే దినం" సందర్భంగా ప్రజలు కథలు ఇతరులకు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి. కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాతపూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్‌లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ (స్ట్రాటజిస్టులు, పాడ్‌కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) కూడా ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది. తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కథలను వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

# కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని



పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది. ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించు కోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడక తప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది. కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

# దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ.





### టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ విజయవంతం
### :జిల్లా పార్లమెంట్ సెక్రటరీ మోహన్ రెడ్డి

**ఏప్రిల్ 27, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ విజయవంతంగా జరిగిందని జిల్లా పార్లమెంట్ సెక్రటరీ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుచానూరు లో స్థానికంగా ఉన్న జిల్లా పార్లమెంట్ సెక్రటరీ మోహన్ రెడ్డి స్వగృహం వద్ద రాష్ట్ర పార్టీ పంపిన తెలుగుదేశంపార్టీ సభ్యత కార్డులను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు రాష్ట్ర వన్నియకుల క్షత్రియ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సి ఆర్ రాజన్ సూచనల మేరకు టిడిపి సభ్యత్వ కార్డులను విజయవంతంగా పంపిణీ చేశామని అన్నారు. నారా చంద్రబాబునాయుడు ను అఖండ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తను తగిన విధంగా పార్టీ గుర్తింపునిస్తుందన్నారు.
టిడిపి సభ్యత్వం కలిగిన శ్రేణులుకు భీమా సౌకర్యంతో పాటు, పిల్లల చదువులకు, ఉద్యోగ కల్పన జరుగుతుంది అని అన్నారు.సమాజంలో కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ టీడీపీ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెరుమాళ్, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి , టిడిపి సీనియర్ నాయకులు శ్రీరాములు నాయుడు, పరాసరేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నీలకంఠం, బోర్డు మెంబర్ శేషాద్రి
మురళి, వాసు, కార్తీక్ టిడిపి కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# బాక్సింగ్ క్రీడాకారిణి నస్రీన్‌కు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ చేయూత





### రూ.1,28,000 ఆర్థిక సహాయం అందజేత
### అన్ని విధాల అండగా ఉంటానని హామీ

**కాకినాడ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం కు చెందిన జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి షేక్ నస్రీన్ కు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేయూతనందించారు. చిన్నతనం నుండి బాక్సింగ్ క్రీడపై మక్కువ పెంచుకున్న నస్రీన్ కుటుంబ సభ్యులు, దాతల ప్రోత్సాహంతో ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి ఔరా అనిపించింది. తన అసమాన ప్రతిభతో నస్రీన్ 2019లో ఉత్తమ బాక్సర్ గా అవార్డు అందుకుంది. 2028 లో అమెరికా లో లాస్ ఏంజెల్స్ లో నిర్వహించనున్న ఒలంపిక్స్ లో పాల్గొని దేశానికి పతకం అందించడమే లక్ష్యంగా సాగుతున్న నస్రీన్ కు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి, రాజమండ్రిలో ఒక ప్రైవేట్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్న తండ్రి షేక్ మస్తాన్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనడంతో పాటు, ఒలంపిక్స్ క్రీడలకు సన్నద్ధం అవ్వాలంటే భారీగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తుంది, ఇందులో భాగంగా నస్రీన్ తన సోదరుడితో కలిసి శనివారం కాకినాడ క్యాంప్ కార్యాలయంలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ను కలిసి తన పరిస్థితిని వివరించడంతో పాటు బాక్సింగ్ లో తాను సాధించిన పతకాలు, అవార్డులు, భవిష్యత్ ప్రణాళికలు వివరించి ఆర్థికంగా చేయూతనందించాలని వేడుకుంది, నస్రీన్ అసమాన ప్రతిభ, ఆర్థిక పరిస్థితి చూసి చలించిపోయిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అప్పటికప్పుడు రూ. 1,28,000 నగదును నస్రీన్ కు అందించడం తో పాటు, భవిష్యత్తులో అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దీనిపై ఆనందం వ్యక్తం చేసిన షేక్ నస్రీన్ మాట్లాడుతూ ఇప్పటివరకు సహాయం కోసం ఎంతోమంది రాజకీయ నాయకులు,దాతలను సంప్రదించానని అయితే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ లా ఆదరించిన వ్యక్తిని ఇప్పటి వరకు చూడలేదన్నారు. సహాయం కావాలని తలుపు తట్టిన మొదటి రోజునే ఒక సోదరుడిలా ఆప్యాయంగా మాట్లాడి ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇవ్వడం జీవితాంతం మర్చిపోలేనన్నారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఇచ్చిన తోడ్పాటు,సహకారంతో ఈ ఏడాది మే నుండి డిసెంబర్ వరకు ఢిల్లీలో జరిగే శిక్షణా తరగతులకు హాజరవుతున్నాని, అందరి ఆశీస్సులతో వచ్చే ఒలంపిక్స్ లో కచ్చితంగా పతకం సాధిస్తానని షేక్ నస్రీన్ తెలిపారు.

# మద్యం దుకాణం మాకొద్దు అంటూ
# నాలుగో రోజు మద్యం షాపు వద్ద మహిళలు ధర్నా..





**పాతపట్నం ఏప్రిల్ 27 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ మహిళలు మా పరిసరాలలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వెంటనే తరలించాలని నాలుగవ రోజు ఆదివారం నినాదాలు చేస్తూ బైఠాయించారు. శనివారం రాత్రి స్థానిక ఎక్సైజ్ సీఐ తో మహిళలు వాగ్వివాదానికి దిగి ఎట్టి పరిస్థితుల్లో మద్యం అమ్మకాల కొనసాగించమని తరలిస్తే తప్ప మా పోరాటం ఉధృతం చేస్తూ దుకాణం ఎదుట ఆందోళన దిశగా నిరాహార దీక్ష చేస్తామన్నారు. ఆదివారం ఉదయం యధావిధిగా దుకాణం తెరిచి అమ్మకాలు కొనసాగిస్తుండగా మహిళలు వెళ్లి వారిని ఆపే ప్రయత్నం చేస్తూ ఆందోళనకు దిగారు. మహిళలు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తో ఫోన్లో మాట్లాడి ఎక్సైజ్ సిఐ తాము స్థానికులు కాదని పెయిడ్ ఆర్టిస్టులుగా ఆరోపించడం సబబుగా లేదని వివరించారు. మీరు జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరగా తనకు రెండు రోజులు గడువు ఇస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన స్థానికులు ఎమ్మెల్యేను కలిసి మా కాలనీ పరిసరాల్లో వెలుగు కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొన్న మహిళలకు ఉపయోగకరంగా ఉందన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాస్థలం కోర్టు పరిధిలో ఉన్నందున విద్యార్థినీ, విద్యార్థులు ఆట స్థలంగా కూడా వినియోగించు కుంటున్నారని తెలిపారు. ఈ మద్యం షాప్ ఎదురుగా ఇండ్ల స్థలాలు కొన్నవారు కూడా యువకులందరికి ఆట స్థలంగా వినియోగించేందుకు అవకాశం కూడా ఇచ్చారన్నారు. స్థానిక కాలనీ మహిళలు, యువకులు. చిన్నారులు అందరు కూడా ఈ పరిసరాల్లోనే నిత్యం వాకింగ్ చేస్తూ ఆటలు ఆడుకుంటూ ఉంటారని వారు వివరించారు. పాతపట్నంలో శాంతియుత వాతావరణం గా ఉన్న ఈ కాలనీలో ఈ మద్యం షాపు ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. ఎమ్మెల్యే తన పిఏ తో మాట్లాడి ఎక్సైజ్ సీఐకు చెప్పి వెంటనే ఈ మద్యం దుకాణం ను వేరే ప్రాంతానికి తరలించాలని విన్నవించుకున్నారు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న మా కాలనీలో అలజడులు సృష్టించ వద్దని మా ప్రశాంతతకు భంగం కలిగించవద్దని ఈ ప్రాంతం నుండి మద్యం షాపును తరలించని ఎడల నిరవధిక దీక్ష చేయటానికి కూడా వెనకాడమని హెచ్చరించారు..

## ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూన
## బివిఎస్ తుగ్గలి మండల అధ్యక్షుడు చెన్నకేశవ నాయుడు



తుగ్గలి మండల కేంద్రంలో ఆదివారం ప్రజా జ్యోతి పాత్రికేయులతో మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం సరికాదని అన్నారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా వారిని కఠినంగా శిక్షించాలని, శాంతియుతభావంతో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్న మన దేశంలో ఇలాంటి ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బి వి ఎస్ తుగ్గలి మండల అధ్యక్షులు చెన్నకేశవ నాయుడు, అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి అత్యంత హేయమైన చర్య అని బోయ వాల్మీకి సమితి తుగ్గలి మండల అధ్యక్షులు చెన్నకేశవ నాయుడు, అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించామని అన్నారు. మరణించిన కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## తిరుపతి శిల్పారామంలో సమ్మర్ క్యాంప్.





**ఏప్రిల్ 27, (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** వేసవి సెలవుల నేపథ్యంలో శిల్పారామంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నామని శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్ అన్నారు. ఆదివారం తిరుచానూరు వద్దగల శిల్పారామంలో సమ్మర్ క్యాంప్ వివరాలను తెలపడానికి శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ...శిల్పారామంలో పిల్లలకు వేసవి సెలవులు సందర్భంగా సమ్మర్ క్యాంప్ లో భాగంగా శాస్త్రీయ నృత్యం, మట్టి కుండలు, మట్టి బొమ్మల తయారీ, డ్రాయింగ్ తరగతులు నిర్వహించనున్నామని అన్నారు. సమ్మర్ క్యాంపు 01.05.2025 నుండి 31.05.3025 వరకు ఉంటుందని ఉదయం 9.00గంటల నుండి మధ్యాహ్నం 1.00గంటల వరకు 6 సం నుండి 16 సం ల విద్యార్తినీ / విద్యార్థులు అర్హులు అని చెప్పారు.అన్ని కోర్సుల నిమిత్తం ఫీజు నెలకు రూ.1,000/- చెల్లించి వారి పేరును నమోదు చేసుకోవలసినదిగా పిలుపునిచ్చారు.కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు శిల్పారామం, తిరుపతి వారిచే గుర్తింపు పత్రములు అందజేయుబడును అని తెలిపారు. సమ్మర్ క్యాంపులో చేరదలిచిన వారు వస్తువులను వారే తీసుకొని రావాలి అని
మరిన్ని వివరాలకు సంప్రదించండి 8886652044, 8886652016 నంబర్లను సంప్రదించవలసినదిగా కోరారు.

## పార్టీ కోసం కష్టపడి పని చేయండి
### పార్టీ సీనియర్ నాయకులు పూలరమణ



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** నిరంతరం ప్రజల కోసం పనిచేయాలని ఉద్దేశంతో జనస్థానం పార్టీ స్థాపించి ఎల్లప్పుడూ అండగా ఉండే పవన్ కళ్యాణ్ ఆదేశాలను వ్యవహరిస్తున్నటువంటి పామిడి పట్టణంలో ఉన్నటువంటి జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ ఆత్మీయ కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి గుంతకల్ నియోజకవర్గం నాయకులు పూల రమణ జీవన్ బాలాజీ పవన్ గోపి బాబు సుభాన్ పలువులు హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ అందరి కోసం ఆలోచన చేసి పార్టీ స్థాపించారు కొంతమంది గిట్టని వారు పార్టీ గురించి కార్యకర్తల గురించి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు అలాంటివి చేయకండి ఎందుకంటే స్థాపించినది ఎవరు రాకూడదని చెప్పడానికి సిద్ధాంతాలు లేవు కులాలు, మతాలు అతీతంగా పార్టీ కోసం వచ్చి పని చేయొచ్చు పార్టీ కోసం కలిసి పని చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శరత్ ప్రధాన కార్యదర్శులు జగదీష్ షేక్షావలి సంయుక్త కార్యదర్శి లాలు జనసేన పార్టీ నాయకులు వడ్డే రాము సమీర్ ఖాజావలి కత్తిరి మన సుబ్బు లాయరు సతీష్ అర్జున్ రాముడు చిన్న అశోక్ కుమార్ సిద్దయ్య సూర్య వడ్డే రామాంజనేయులు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నేచురల్ స్టార్ నాని.



**ఏప్రిల్ 27, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు హీరో నాని.తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం కాలినడకన తిరుమలకు చేరుకున్న వీరు శనివారం తిరుమలోనే బస చేసి ఆదివారం ఉదయం వేకువ జామున స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.వీరికి ఆలయ అధికారులు దగ్గరుండి దర్శన ఏర్పాట్లను చేశారు.దర్శనం అనంతరం ఆలయ రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా,అధికారులు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపలకు వచ్చిన హీరో నాని మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది స్వామి ఆశీస్సులు కోసం తిరుమలకు వస్తుంటానని అయన గుర్తు చేశారు.అలాగే తన హిట్ 3 చిత్రం విజయం కావాలని అందుకు ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరినట్లు ఆయన మీడియాకు తెలిపారు.ఆలయం ముందుకు వచ్చిన నాని,శ్రీ నిది శెట్టిలను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.వారితో కలిసి సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

## భగవాన్ శ్రీ సత్య సాయి వందవ పట్టిన రోజు సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు



**కొత్తూరు ఏప్రిల్ 27 ప్రజా జ్యోతి న్యూస్..** కొత్తూరు మండల కేంద్రంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మందిరం లో బాబా వారి వందవ పట్టిన రోజు సందర్భంగా సంవత్సరాదిన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా “అమృత కలశం”అనే కార్యక్రమం ద్వారా నిరుపేదలకు నిత్య అవసర సరుకులు పది కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, గోధుమ పిండి, ఉప్పు, ఎండు మిరపకాయలు,బంగాళదుంపలు, ఉల్లి పాయలు, చింతపండు, నూనె, పంచదార, రెండు రకాల సబ్బులు, దాదాపు 13 రకాల వస్తువులను ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి భక్తులతో కలిసి పంపిణీ చేశారు. ఈ అనంతరం తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందల భక్తులు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** జిల్లాలోకి ప్రవేశించే, బయటకు వెళ్ళే ప్రధాన మార్గాల వద్ద 615 వాహనాలను తనిఖీ చేసిన పోలీసు బృందాలు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో రైల్వే స్టేషనులు, బస్టాండులు, ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో కుణ్ణంగా తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో ఏక కాలంలో 54లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు అధికారులు, సిబ్బంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో తనిఖీల్లో పాల్గొన్న స్నిఫర్ డాగ్స్, బాంబ్ డిస్పెజల్ బృందాలు దేశంలో ఉగ్రవాదులు కాశ్మీర్ రాష్ట్రం పహల్గాం ప్రాంతంలో దాడులకు తెగబడి, భారతీయులపై కాల్పులకు పాల్పడడంతో రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ ఆదేశాలతో అప్రమత్తమై, జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మికంగా వాహన తనిఖీలు, లాడ్జిలు, హెరీటల్స్, పబ్లిక్ ప్రాంతాల్లోను తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 27న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులు జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో దాడులకు తెగబడిన నేపథ్యంలో రాష్ట్ర డిజిపి గారి ఆదేశాలతో అప్రమత్తమై, జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహనాలు, లాడ్జిలు, హెరీటల్స్, పబ్లిక్ ప్రాంతాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లులో తనిఖీలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 26న ఏక కాలంలో తనిఖీలు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ప్రధాన జంక్షన్లు వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, అనుమానితుల బ్యాగులను తనిఖీ చేసామన్నారు. పోలీసుశాఖకు చెందిన స్నిఫర్ డాగ్స్, బాంబ్ డిస్పోజల్ బృందాలు ముఖ్య కూడళ్ళు, రైల్వే స్టేషన్లు, బస్టాండుల వద్ద బాంబ్లను గుర్తించే ప్రత్యేకమైన ఇక్విప్మెంట్ తో తనిఖీలు చేపట్టారు. జిల్లాలోకి ప్రవేశించి ప్రధాన మార్గాలు, సరిహద్దు జిల్లాలకు వెళ్ళే ముగింపు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టి, 615 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసారు. అదేవిధంగా అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు లాడ్జిలు, హెరీటల్స్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, బస చేసే వ్యక్తులు ఎందుకు వచ్చింది, ఏ పని మీద వచ్చింది తెలుసుకొని, వారి గుర్తింపు కార్డులను పరిశీలించి, అనుమానితుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైజ్లతో తనిఖీ చేసి, వారి నేరచరిత్రను పరిశీలించారు. తనిఖీల్లో 13మంది వ్యక్తులు ఇతర ప్రాంతాల నుండి వివిధ పనుల మీద జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బస చేస్తున్నట్లుగా గుర్తించామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 ప్రాంతాల్లో ఏంటి సేబిటేజ్ తనికీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సిఐలు, ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, బి.డి.టీం బృందాలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తనిఖీల నిర్వహణలో పాల్గొన్నారు.

# శృంగవరపుకోట నియోజకవర్గంలోని యువతీ యువకులకు సువర్ణ అవకాశం..

**శృంగవరపుకోట, ప్రజా జ్యోతి న్యూస్, రిపోర్టర్ సురేంద్ర:** టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ గొంప క్రిష్ణ విశాఖ పార్లమెంట్ సభ్యులు భరత్ గీతం కాలేజీలో నిర్వహించనున్న ఉద్యోగ మేళాపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు ఉత్తమ ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా ఈ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అమర్ రాజా కంపెనీ పాల్గొంటాయని, ఇంటర్వ్యూలు నేరుగా నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపడతారని చెప్పారు.టెన్త్ ,ఇంటర్ మరియు ఐటిఐ విద్యార్థులకు ఇది గొప్ప అవకాశం అని ఆయన అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హత:

10వ తరగతి పాస్ / ఫెయిల్ ఇంటర్మీడియట్ పాస్ / ఫెయిల్ %ఋ×% పాస్ / ఫెయిల్ 18 నుండి 35 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు (పురుషులు మరియు మహిళలు) అర్హులు

శిక్షణ వ్యవధి:

%వాజ -% 24 నెలలు

ఇంటర్ %-% 18 నెలలు

%ఋ× -% 12 నెలలు

శిక్షణ సమయంలో స్టైపెండ్: ?12,500 %- ?15,000/-

% శిక్షణ తరువాత నెలవారీ వేతనం (%జుజ): ?22,000/-

%సబ్సిడీతో భోజనం, ఉచిత వసతి వసతి లభ్యం

స్థలం: గీతం క్యాంపస్, విశాఖపట్నం

సమయం: ఉదయం 9:00 గంటల నుండి



1,000ం ఉద్యోగ అవకాశాలు

దరఖాస్తు చేసుకోండి: https://bit.ly/AmarrajaatGITAM ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవి కుమార్ (జామి టీడీపీ మండలం పార్టీ అధ్యక్షులు), గొంప వెంకటరావు (వేపాడ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు),జుత్తాడ రామసత్యం (శృంగవరపుకోట మండల పార్టీ సెక్రటరీ), ఆడారి రమేష్ .కోట టౌన్ చీఫ్ సెక్రటరీ), మాదిబోయిన మంగరాజు(%వా%.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు),గనివాడ సన్యాసి నాయుడు (వినాయకపల్లి సర్పంచ్), కోరుకొండ శ్రీనివాస్ రావు(వాసి మాజీ సర్పంచ్), జనపురెడ్డి ఈశ్వరరావు,గొర్లి నాగరాజు,ఏడువాక రమణ ఎక్స్ ప్రెసిడెంట్ (దేశపాత్రునిపాలెం), మండల పార్టీ కార్యదర్శి వల్లపు ఈశ్వరరావు , తూరిబిల్లి శ్రీరాములు మరియు శృంగవరపుకోట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ సీనియర్ నాయుకులు పాల్గొన్నారు.

# సమాజానికి మేల్కొపేది జర్నలిస్టులే





### శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

### అట్టహాసంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జర్నలిస్టు జిల్లా మహాసభలు

**శ్రీకాకుళం, ప్రజా జ్యోతి న్యూస్:** ప్రజలను అన్ని రంగాల్లో చైతన్యం చేస్తూ సమాజాన్ని మేల్కొపేది జర్నలిస్టులేనని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్ రెవెన్యూ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ జిల్లా మహాసభలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులంతా ఐక్యమత్యంగా ఉంటూ వారి హక్కులను సాధించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో జర్నలిస్టల పాత్ర కీలకమైనదన్నారు. సమాజంలో న్యాయవ్యవస్థ, రాజకీయాలు, ప్రజలు, జర్నలిజం నాలుగు స్తంభాలని, జర్నలిజం అంటే ప్రజల్లోనూ, అధికారుల్లోనూ ఎంతో గౌరవం ఉందని తెలిపారు. ఈ వృత్తికి మరింత గౌరవం తెచ్చేలా జర్నలిస్టులు నడుచుకోవాలని చెప్పారు. జర్నలిజం గౌరవంగా, పవిత్రంగా భావించబడే ఒక రంగం అని తెలిపారు. ఇది సమాజానికి సమాచారాన్ని అందించే ఒక బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, జర్నలిజం సమాజంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని, ప్రజాస్వామ్యానికి జర్నలిజం అవసరం అని అన్నారు. జర్నలిజం సమాజానికి సమాచారం అందించడం ద్వారా ప్రజలను అవగాహన కలిగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఇది రాజకీయాలను పర్యవేక్షిస్తుందని, ప్రజలకు సమాచారం అందించడం ద్వారా అవినీతిని నిరోధిస్తుందని, జర్నలిజం ఒక ముఖ్యమైన బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, దీనిని గౌరవించవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైసిపి నూతన కమిటీలో అవకాశం దక్కించుకున్న వారికి సత్కారం

**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం,ఏప్రిల్27 ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండల పార్టీ అధ్యక్షులు గా కొలిశెట్టి నాగేశ్వరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా కాకర్ల వెంకటేశ్వరావు,జిల్లా యాక్టివేట్ సెక్రెటరీ గా ఒంబోలు పోసిబాబులకు నూతన కమిటీల్లో అవకాశం దక్కించుకున్న సందర్భంగా జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులుతోట రామకృష్ణ నివాసంవద్ద సర్పంచ్ తిగిరిపల్లివెంకట్రావు ఆధ్వర్యంలోశాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈసందర్భంగా తోటరామకృష్ణ మాట్లాడుతూతాళ్లపూడిమండలం నుంచి నూతన కమిటీల్లో ముగ్గురికిఅవకాశంకల్పించినందుకురాష్ట్రమాజీముఖ్యమంత్రి వైయస్జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి వెంకటరావు, పార్లమెంటు ఇంచార్జి డా.గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడిరాజా కు మా గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు పోసిన శ్రీ కృష్ణ దేవరాయలు, పోచవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరబాబు, పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షులు చింతా వెంకటస్వామి,నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



## పిఏసి మెంబర్‌గా తమ్మినేని

### అభినందనలు తెలిపిన ఆమదాలవలస ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామమూర్తి



**ఆమదాలవలస ,ప్రజాజ్యోతి న్యూస్ :** దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ను వైసిపి పార్టీ అధిష్ఠానం పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమిస్తూ గురుతర భాద్యతను అప్పగించింది. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎంపీపీ ప్రతినిధి,మండల పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీరామమూర్తి ఆయనను ఆమదాలవలస పట్టణంలో తమ్మినేని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తమ్మినేని కి శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామ మూర్తి మాట్లాడుతూ పి ఏ సి కమిటీ నియామకంలో పార్టీ అధిష్ఠానం శ్రీకాకుళం జిల్లా నుండి తమ్మినేని సీతారం ను నియమించడం జిల్లాలో పార్టీ బలోపేతానికి మరింత దోహదం చేస్తుందన్నారు. పార్టీ అధిష్ఠానం తమ్మినేని కు తగిన గౌరవం ఇచ్చిందని ,ప్రతీ ఒక్క వైసిపి నాయకుడికి , కార్యకర్త కు ఇది గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

## మే 01 నుండి పరిశీలనాత్మకంగా వీఐపీ బ్రేకు దర్శనాల్లో మార్పు




**ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** వేసవి సెలవుల రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపి లకు మాత్రమే మే 01 నుండి జూలై 15 వరకు బ్రేక్ దర్శనాలు పరిమితం శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం టిటిడి మే 01 తారీకు నుండి పలు కీలక నిర్ణయాలు అమలు చేయనుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఇప్పటికే తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా మే 01 తారీకు నుండి జూలై 15 వ తారీకు వరకు, వీఐపీ బ్రేక్ దర్శనాలు కేవలం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేయనుంది. అదేవిధంగా మే 01 తారీకు నుండి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రయోగాత్మకంగా ఉదయం 6 గంటల నుండి అమలు చేయనుంది.

## శాస్వత చలివేంద్రం ప్రారంభం..



**ఎప్రిల్ 27 (ప్రజా జ్యోతి )తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి మాజీ ఎమ్మెల్యే మబ్బురామిరెడ్డి తనయుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి ఆదివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ సమీపంలో చలివేంద్రం ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ పంపిణించేసారు.నగరంలో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తిరుపతికి వచ్చే యాత్రికులకు పాదచారులకు దాహోర్తిని తీర్చాలన్న సంకల్పంతో నేడు చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని మబ్బు దేవ నారాయణ రెడ్డి వెల్లడించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బట్టు రవి శంకర్ రెడ్డి, చంద్ర బాబు, వాసు, సిద్ధా రెడ్డి, షేక్, భాస్కర్, మూర్తి. బాలాజీ, ముని రామయ్య, శేఖర్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకున్న ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థి...... బుడుమూరు ఉదయ్ కుమార్



**ప్రజా జ్యోతి( బూర్జ)** మండలంలోని ఓవి పేట గ్రామంలో ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థి బుడుమూరు ఉదయ్ కుమార్ ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో 593 మార్కులు సాధించి మండలంలో అగ్రస్థానంలో నిలుచున్నాడు ఇది అందరికీ తెలిసిన విషయమే. ఈ మేరకు ఆముదాలవలసకు చెందిన ఐకాన్ స్టడీ సెంటర్ వారు ఉదయ్ కుమార్ కు ద బెస్ట్ స్టూడెంట్ అవార్డును ఆదివారం సదర విద్యార్థికి అందజేశారు. ఐ కాన్ స్టడీ సెంటర్ వారు మాట్లాడుతూ ఉదయ్ కుమార్ ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని. తదుపరి పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు తెచ్చుకోవాలని వారు సూచించారు.

# కంచికచర్లలో విస్తృతంగా కార్డన్ -సెర్చ్ ఆపరేషన్







**కంచికచర్ల, ఏప్రిల్ 27 - ప్రజాజ్యోతి** ఎన్.టి.ఆర్.జిల్లా పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యలలో భాగంగా, సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడే వ్యక్తులు సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నాము అనే భరోసా ఇచ్చేందుకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు రూరల్ డి.సి.పి. కె. ఎం మహేశ్వరరాజు ఐ. పి. ఎస్, నందిగామ ఏ.సి.పి ఏ.బి.జి.తిలక్, నందిగామ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చవాన్, ల పర్యవేక్షణలో చందర్లపాడు, జగ్గయ్యపేట, చిల్లకల్లు, వీరులపాడు, కంచికచర్ల ఎస్.ఐ.లు మొత్తం 88 మంది పోలీస్ సిబ్బందితో కలిసి కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరాకాలని లో ఆదివారం ఉదయం 5.00 గంటల నుండి 8.00 గంటల వరకు కార్డన్ %డ% సెర్చ్ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేని 23 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని. 7 మంది అనుమానితులను అదుపులోనికి విచారించడం జరిగిందని. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించబడిన పరిసర ప్రాంతాలలో అణువణువు, క్షుణ్ణంగా సోదాలు చేయడం జరుగుతుందని, గంజాయి, ఇతర మత్తు పధార్ధాల విక్రయాలు మరియు వినియోగంపై, అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీయడం జరిగిందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, రాత్రి సమయాలలో జరిగే చిన్న సంఘటనలు పెద్ద సంఘటనలు గా ప్రజల్లో వ్యాప్తి చెందుతుందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతిరోజూ అన్నీ ముఖ్య ప్రదేశాలలో కార్డన్ %డ% సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ %డ% డ్రైవ్ లాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఏవిధమైన ఘర్షణ లకు ఆస్కారం లేకుండా, అసత్య ప్రచారాలను నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇకనుంచి తరచుగా కార్డన్ %డ% సెర్చ్, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతోపాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతుంది. నేరాలు, ఘర్షణలు నియంత్రణకు పూర్తిస్థాయిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం





**బద్వేల్ ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈరోజు అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్, వైయస్సార్ జిల్లా విభాగం వారి ఆధ్వర్యంలో బద్వేల్ నియోజకవర్గంలో పోరుమామిళ్ల మరియు బద్వేలు వేదికలుగా ఆత్మీయ సమావేశములు నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల యొక్క ప్రధాన సమస్యలు అయినటువంటి ప్రమోషనల్ ఛానల్, వివిధ ఇంజనీరింగ్ విభాగములలో విలీనం మరియు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఎదుర్కొన్నటువంటి వివిధ సమస్యల గురించి విపులముగా చర్చించారు. ఈ సమస్యల పరిష్కారమునకు క్షేత్రస్థాయి నుంచి ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముందుకు వచ్చి ఐకమత్యముగా వారి యొక్క సహాయ సహకారములు అందించవలసినదిగా సంఘం నుంచి పిలుపునిచ్చారు. దీనికి వారి నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. భవిష్యత్తు కాలంలో సంఘం పేరు మీద ఒక వెబ్సైట్ ని కూడా ప్రారంభించి తద్వారా ఫిర్యాదుల సేకరణ మరియు వివిధ ఉపయోగకరమైన కార్యకలాపములు జరపబడునని సంఘ పెద్దలు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీకర రావు. జిల్లా ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి. జిల్లా జనరల్ సెక్రటరీ దామోదర్. జిల్లా వైస్ ప్రెసిడెంట్లు సుబ్బారెడ్డి. ఖలీల్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** శంఖవరం మండలం అన్నవరం చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలిసితిరిగిన ఆ స్నేహితులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. స్నేహితులంతా ఒకటై స్నేహబంధాన్ని మరింతగా బలపర్చుకొన్నారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యదేవ కళాశాల ఆవరణలో శ్రీ వీర వెంకట సత్యదేవ డిగ్రీ కళాశాల లో2002-2005 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులంతా 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని శ్రీ వీర వెంకట సత్యదేవ ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ వృత్తుల్లో, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ప్రస్తుత బిజీ షెడ్యూల్లో కూడా స్నేహ బంధమే ముఖ్యమంటూ ఒకచోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా తమ వయసుని సైతం పక్కనపెట్టి వినోద కార్యక్రమాలు పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ముందుగా పరిచయం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రూప్ ఫోటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరిని ఒకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక కు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అభినందించారు

## పోలేరమ్మ తల్లి ఉత్సవాలలో పాల్గొన్న రితేష్ రెడ్డి

**బద్వేల్ ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణంలోని 18 వ వార్డులో కొలువై ఉన్న శ్రీరాముని రామాలయం గుడి నిర్మించి 41 రోజుల అయిన సందర్భంగా పోలేరమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బద్వేల్ శివకుమార్ ఆహ్వానం మేరకు బద్వేల్ టిడిపి సమన్వయకర్త యువనేత రితేష్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోలేరమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి. మిత్తె కాయల రమణ. ప్రసాద్. సుధాకర్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, పెంచలయ్య, వెంకటసుబ్బయ్య, వెంకట సుధా. జయమ్మ. కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మేడేను విజయవంతం చేయాలి.




**పోడూరు /ఆచంట, ఏప్రిల్ 27,ప్రజాజ్యోతి న్యూస్ .** మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటలపనిదినంహక్కులను కాపాడుకోవడానికి ప్రతి కార్మికుడు దీక్షపునుతూ వాడవాడలా మేడే జండాలు ఆవిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం నేడేను విజయవంతం చేయాలని కోరుతూ కొడమంచిలి గ్రామంలో కార్మికులను కలిసి మేడే సమీకరణకు ఏర్పాటులో ఉన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాల రాసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్ లను తీసుకువచ్చాయని అన్నారు. 8 గంటల పని దినం స్థానే 12 నుంచి 15 గంటల పని చేసేలా పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కార్మికుల దోపిడీ తీవ్ర మౌతుందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వారి చేత వేట్టి చాకరిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . అసంఘటిత రంగం కార్మికుల సంక్షేమానికి సమగ్రచట్టంరూపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికుల పని ప్రదేశాల్లో నివాస ప్రాంతాల్లో విస్తృతంగా మే డే జండాలను ఆవిష్కరణ చేయాలన్నారు. నూతన రవాణా చట్టం డ్రైవర్ల పాలిట ఉరితాళ్ల గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండి రంగారావు, పి మోహన్ రావు, మచ్చ సుబ్బారావు, ఇంజేటి వీరయ్య, కారిపల్లి రాజు మచ్చ మరియమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, మచ్చ రాంబాబు, నక్కచిన్న నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## నక్షతతో భూతగాదాలకు చెక్‌: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**ఏప్రిల్ 27,(ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతిః నక్ష ఫైలెట్ ప్రాజెక్ట్ కింద తిరుపతిలో డ్రోన్ సర్వే ను ఆదివారం వినాయకసాగర్ లో జెండా ఊపి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. డ్రోన్ సర్వే తీరును అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్స్ రికార్డ్ మానిటరింగ్ ప్రొగ్రాం క్రింద కేంద్ర ప్రభుత్వం నక్ష ప్రాజెక్ట్ కింద తిరుపతిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాలు నక్ష ప్రాజెక్ట్ కు ఎంపికైనట్లు ఆయన చెప్పుకొచ్చారు. నక్ష ప్రాజెక్ట్ కింద జరగనున్న డ్రోన్ సర్వేతో ఆక్రమణలకు చెక్ పడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీంతో నగరంలోని చెరువులు, గుంటలు, కాలువల ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని ఆయన చెప్పారు. దీంతో నీటి నిల్వలు పెరగడమే కాకుండా కాలుష్య నియంత్రణకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో గత ఐదేళ్ళలో రీసర్వే పేరుతో భూతగాదాలు పెరిగిపోయాయన్నారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత నక్ష ప్రాజెక్ట్ తో సాధ్యమౌతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రోన్ సర్వే విజయవంతానికి రెవెన్యూ, ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్ అమరయ్య, ఏసిపి బాలాజీ, జనసేన నాయకులు, వీరమహిళలు తదితరలు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంఘ ఆధ్వర్యంలో కాశ్మీరు ఘటనకి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ.




**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** శృంగవరపుకోట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదుల పర్యాటకులపై విభరించిన కాల్పులలో మరణించిన వారికి ఆత్మ శాంతి చేకూరాలని ఇలాంటి హింసాయిత కార్యక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తూ పట్టణంలో దేవి జంక్షన్ నుండి స్థానిక ఆర్టీసీ డిపో వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నానాజీ మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడి దారుణమైనదని ఇకపై కాశ్మీర్ జమ్మూ ప్రాంతాలను పర్యటించడానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలియజేశారు పటిష్టమైన చర్యలను చేపట్టి ఉగ్రవాద దాడులను చేసినవారిని ఉరి తీయాలని కోరారు ఈ కార్యక్రమంలో వాసవి యువజన సంఘం సభ్యులు బాలనాగు శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల విజయకుమార్, పూర్వాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్ రీజనల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు కొల్ల వెంకటేష్ తోటసేనయ్య కోడేటి వెంకట సత్యనారాయణమూర్తి, మెగా అధ్యక్షులు పచ్చి కోళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణకు విలన్ నంబర్-1 కాంగ్రెస్సే



**హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యిందని.. ఏడాదిన్నర పాలనలో ఏం చేశారంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు నిలదీశారు. సంచులు నింపుడు.. మోయడంలోనే కాంగ్రెస్ పాస్ అయ్యిందంటూ మండిపడ్డారు. వరంగల్ శివారులోని ఎల్కతుర్తిలో 'రజతోత్సవ సభ'పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టానని.. 25 ఏళ్లనాడు గులాబీ జెండా ఎగరేశాం.. ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం.. అందరూ అశ్చరపోయేలా పదేళ్లపాటు తెలంగాణను పాలించామని కేసీఆర్ అన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం.

సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

**ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు..**

"కల్యాణ లక్ష్మికి కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తున్నారు.. మేము వస్తే తులం బంగారం కూడా ఇస్తామన్నారు. పెన్షన్లు పెంచుతామన్నారు.. స్కూటీలు కొనిస్తామన్నారు.. జాబ్ కార్డులు ఇస్తామన్నారు.. ఇచ్చారా?. ఇప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న ఆయన.. ఎన్ని హామీలైనా అమలు చేసి చూపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఉన్న దేవుళ్ల అందరిపైనా ఒట్లు వేశారు. మహిళలే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వద్దని అంటున్నారు. ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుట్టడం లేదని.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారు.. పరిపాలన చేయడం రాక రాష్ట్రాన్ని ఆగమాగం చేశారు. తెలంగాణను నంబర్‌వన్ స్థానంలో నిలబెడితే.. ఇప్పుడు 14వ స్థానానికి తీసుకెళ్లిపోయారు. హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు" అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేవారు.

**ఇక నుంచి నేను కూడా ఊరుకోను..**

యూనివర్సిటీ భూములను ఎవరైనా అమ్ముతారా?. కేసీఆర్ కిట్స్‌ను ఎందుకు బంద్ చేశారు? ఎవరైనా వాటిని ఆపుతారా?. ఇవాళ హైదరాబాద్ యూనివర్సిటీ రేపు ఉస్మానియా యూనివర్సిటీ అమ్మేస్తారు. వైఎస్సార్ తెచ్చిన ఆరోగ్యశ్రీని కొనసాగించాలని చెప్పాను. ఆరోగ్యశ్రీ పథకం మంచిది.. కొనసాగించాలని నేను సీఎం అయ్యాక చెప్పాను. ఇప్పుడున్న సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. ఇక నుంచి నేను కూడా ఊరుకోను. ఎక్కడ ఎవరు బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో పోరాడదాం. కమీషన్లు అడుతున్నారని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఈ సోది కబుర్లు వినడానికి నేను అసెంబ్లీకి రావాలా?" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

**తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?**

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు.

ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇకపై బయటకు వస్తా..**
**ప్రజలన తరఫున పోరాడతా**

" పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 80-90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరఫున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.


**రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా**

"ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా..భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్‌సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 20-30శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి**

భాజపా వైఖరి అంతా భ్రభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం" అని కేసీఆర్ అన్నారు.

# పాతికేళ్లుగా కేసీఆర్ వెంటే ఉన్నా..



**హైదరాబాద్:** తెలంగాణలో అభివృద్ధిని పరుగులు పెట్టించి, పేద ప్రజలకు సంక్షేమాన్ని పంచిన కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌పార్టీ పాతికేళ్ల పండుగ సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో తన ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు. ప్రజలు ఒక్కసారి చేసే పొరపాటుతో కాంగ్రెస్‌ను ఐదేళ్లు భరించాల్సిన పరిస్థితి నెలకొం ది. దీంతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారు. తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక కేసిఆర్ అని, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ద్వారా మరోసారి రుజువు కానుంది. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే తెలంగాణ రాష్ట్ర సాధన కల సంతృప్తి ఇచ్చింది. హైదరాబాద్ పాతబస్తీ నుంచి పాతికేళ్లుగా కేసీఆర్ వెన్నంటే నడుస్తున్నా, టీఆర్ఎస్ పార్టీ అవిర్భావం కంటే ముందు పత్రికలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం రాబోతున్నట్లు చదివి వెంటనే ఆయన ఇంటికి వెళ్లి కలిశా.. హైదరాబాదీ ముస్లిం - తెలంగాణ ఉద్యమంలో ఎలా కలిసివస్తావని పలువురు ప్రశ్నించారు. అప్పుడు నేను విద్యార్థి దశలోనే 1969 తెలంగాణ ఉద్యమ్యంలో కీలక పాత్ర పోషించా. ఆ తర్వాత ఉద్యమం చల్లారడం కుటుంబ వ్యాపారంలో నిమగ్నమయ్యా. తెలంగాణ వస్తే ఆంధ్ర పాలకుల పెత్తనం పోయి మా నీళ్లు, మా విద్యుత్, మా ఉద్యోగాలు మాకు వర్తిస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశా. అప్పుడు నన్ను పై ఫ్లోర్‌కు తీసుకెళ్లి నా పేరు అడిగి మహమూద్ భాయి.. మాతో జత కలవండి ...కొట్లాది తెలంగాణ సాధిద్దామని చెప్పి భరోసా ఇచ్ఛారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పిలుపు.. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఒక తండ్రిగా కేసీఆర్ ను గౌరవిస్తూ వ్యూహాలకు అనుగుణంగా పనిచేస్తూ వస్తున్నా. పార్టీ ఆవిర్భావం నుంచి తన నివాసంలోని అఫీస్‌లో కేసీఆర్‌కు ప్రత్యేక చాంబర్, కుర్చీ ఉందని గుర్తు చేశారు. టీఆర్ఎస్ పార్టీలో జీవిత కాలం రెండో సభ్యత్వం నాదే.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తుంటే తన తల్లి, సతీమణి మినహా బంధువులు, మిత్రులు, తోటి వ్యాపారులందరూ ఉద్యమం పేరుతో తూటాలు, లాఠీ దెబ్బలు ఎందుకు తింటావు... ప్రశాంతంగా వ్యాపారం చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు. కానీ, తెలంగాణ సాధన కల లక్ష్యంతో ముందుకు సాగితే.. ప్రత్యేక రాష్ట్ర సాకారంతో పాటు ఊహించని విధంగా డిప్యూటీ సీఎం,హోం మంత్రి లాంటి కీలక పదవులు నిర్వహించే భాగ్యం కలిగింది. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ ఎక్కడికి బయలుదేరినా.. ఆయన చేతికి ఇమామ్%-%ఎ%-%జామీన్ కడుతున్నా.

ఒక సారి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి 1000 కార్ల ర్యాలీ బయలు దేరినప్పుడు తాను జ్వరంతో ఇమామ్%-%ఏ జామిన్ కట్టడం మర్చిపోగా.. మహమూద్ భాయి దట్టీ తేలేదా అని అడిగి చాంద్రాయణ గుట్ట వద్ద అరగంట సేపు ర్యాలీ నిలిపి వేశారు .దట్టి తీసుకొచ్చి కట్టి తర్వాత ర్యాలీ ముందుకు సాగిందని గుర్తు చేసుకున్నారు.

## స్నేహితులంతా ఒకచోట...

## 2008 -09 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్ :** స్నేహితులంతా ఒకచోట కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ తమ బాల్యాన్ని గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఉన్న న్యూ టెంపని పబ్లిక్ స్కూల్ 2008-2009 సంవత్సరంలో 10 వ తరగతి విద్యార్థులందరూ తమ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2008-09 వ పూర్వపు విద్యార్థులు , ఉపాధ్యాయులు పాల్గొని చిన్న నాటి బాల్య స్మృతులను ,సన్నివేశాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆనాటి అనుభవాలను , అనుబంధాలను వేదికపైకి ఎక్కి పలువురు ప్రసంగించారు. ఈ స్కూల్లో చదివిన మేమందరం ఉన్నతంగా చదువుకుని మంచి స్థాయిలో స్తిరపడ్డామని ,స్కూల్ ప్రిన్సిపాల్ యాదవ్ వడ్డేపల్లి వెంకట్ నారాయణ మాష్టర్ ,మిగతా ఉపాద్యాయ సిబ్బంది ఎంతగానో సహకరించి ఉన్నత విద్యను అందించారన్నారు. నాటి వారి అందించిన విద్యా బోధనలు , నేర్పించిన నైతిక విలువలే నేడు ఈ స్థాయికి మమ్మల్ని చెరవేశాయని తెలిపారు. వీరిలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గాను , హైదారాబాద్ సినీ రంగ సినీ పాటలు రాసే రచయితలు గా, ఇంజనీర్లు గా , ఉపాధ్యాయులుగా వివిధ రంగాల్లో వివిధ హొదాల్లో స్థిర పడ్డామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు వెంకటరావు , జయ రాం , రవి, శ్రీను , తులసీ రాం , విజయ్ గౌరీ లకు విద్యార్థులు శాలువా తో ఘనంగా సత్కరించారు.

## యాజలిలో తిరునాళ్ల మహొత్సవం...

## పాల్గొన్న జనసేన సమన్వయకర్త...

## నామాన శివన్నారాయణ...



**బాపట్ల జిల్లా ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కర్లపాలెం మండలం యాజలి గ్రామ దేవత శ్రీ శ్రీ పుట్టలమ్మ అమ్మ వారి తిరునాళ్లు మహొత్సవం లో భాగంగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణని గ్రామ పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు ఇక్కుర్తి చక్రపాణి మరియు కమిటీ సభ్యులు జనసేన నాయకులు సాధారంగా ఆహ్వానించారు అనంతరం దుశ్యాలువతో సన్మానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు యాజలి గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో తులతూగాలని పుట్టలమ్మ అమ్మవారి దీవెనలు అందరికీ అందాలని అమ్మవారిని వేడుకున్నారు

ఈ కార్యక్రమం లో ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ మరియు బాపట్ల ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయమాధురి ఊస మాధవి అకిశెట్టి నాగమల్లేశ్వరి ఊస ప్రసాద్ జిడుగు రాజేష్, గండూరి మోహన్ సిగిరిశెట్టి సంజయ్ నాయుడు గ్రామస్థులు,జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు...

**504 వాహనాలను తనిఖీ చేసి 30 వాహనాలను సీజ్...**




**బాపట్ల జిల్లా ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాతో శనివారం పోలీస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాలు, లాడ్జిలు, హొటల్లు, రిసార్ట్స్ లతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్ లు ఇతర రద్దీ ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని పోలీస్ అధికారులు సిబ్బంది వారి పరిదిలో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. 22 రైల్వే స్టేషన్/బస్టాండ్/రద్దీ ప్రదేశాలలో యాంటీ సబ్ చెక్స్ నిర్వహించి 44 మంది అనుమానితులను విచారించడం జరిగిందన్నారు. జిల్లాలోని 70 లాడ్జ/హొటల్/రిసార్ట్స్ లను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. 46 ప్రదేశాలలో 504 వాహన తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 30 అనుమానిత వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. లాడ్జిలు, హొటల్లు, రిసార్ట్స్ ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బస చేయడానికి వచ్చే వారి గుర్తింపు పత్రం తీసుకోవాలన్నారు. వారు ఏ పని మీద వచ్చారు? ఎన్ని రోజులు ఉంటారు? అను వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ ద్వారం, రిసెప్షన్, కారిడార్, లాంజ్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఎవరి ప్రవర్తననైనా అనుమానాస్పదంగా ఉన్నట్లయితే వెంటనే సంబంధిత స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు (లేదా) టోల్ ఫ్రీ నెంబర్ 112 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించే సమయంలో పోలీసులకు సహకరించాలని ఎస్పి తెలిపారు.

# సోషల్ మీడియా పోస్టులపై నిఘా



**హైదరాబాద్:** సోషల్ మీడియాతో మంచి ఎంత ఉందో.. చెడు కూడా అంతే ఉంటోంది. ఇటీవల కొందరు వ్యక్తులు విద్వేషాలు వెళ్లగక్కేందుకు సోషల్ మీడియా యాప్‌లను అస్త్రాలుగా మార్చుకుంటున్నారు. ఎదుటి వారిని రెచ్చగొట్టేలా పెట్టే అసభ్యకర పోస్టింగులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. కశ్మీర్‌లో ఉగ్రదాడితో దేశంలో ఏర్పడిన సున్నితమైన పరిస్థితుల నేపథ్యంలో ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా మరో వర్గం వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేయడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అనవసర ఉద్రిక్తతలకు దారి తీసే పోస్టులు ఏవైనా ఉన్నాయా? అని పోలీసులు నింతరం ఆరా తీస్తున్నారు. ఇందుకోసం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్‌ను మరింత అప్రమత్తం చేసినట్టు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కేంద్రంతోపాటు అన్ని జిల్లాల్లోని సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ మరింత యాక్టివ్ అయినట్టు తెలిపారు. నకిలీ అకౌంట్లు క్రియేట్ చేసి మార్ఫింగ్ ఫొటోలు, అత్యంత హేయమైన అసభ్యకర పదజాలంతో సోషల్‌మీడియాలో పోస్టింగ్స్ పెట్టే వారికి చెక్ పెడుతున్నారు. అలాంటి పోస్టులను వెంటనే తొలగించడంతో పాటు అవి ఎక్కడి నుంచి, ఎవరు పెడుతున్నారన్నది కూడా ఆరా తీస్తున్నారు. కీలక ఆధారాలు లభించిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని సైబర్ క్రైమ్ పోలీసులతో పాటు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు దీనిపై నిరంతరం నిఘా పెడుతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిఘా కోసం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ సోషల్ మీడియా సర్వైలెన్స్ వింగ్, సోషల్ మీడియా యాక్షన్ స్క్వాడ్ (స్మాష్)తో నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు.

## గ్రామాల్లో రెపరెపలాడిన గులాబీ జెండా..
# వరంగల్ సభకు దండుగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు



**తిమ్మాజీపేట / వెల్దండ / అచ్చంపేట / అచ్చంపేట రూరల్/ జడ్చర్ల :** బీఆర్ఎస్ సాధించిన ఉద్యమ ప్రస్థానాన్ని మననం చేసుకునే సందర్భంలో వరంగల్ వేదికగా ఆదివారం జరగనున్న రజతోత్సవ జాతరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ శ్రేణులు దండుగా కదిలారు. ఊరు, వాడ ఏకమై అటు జెండా పండుగను ఘనంగా నిర్వహించుకోగా ఇటు ఎల్కతుర్తికి పయనమయ్యారు. తిమ్మాజీపేట మండలంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. జెండాలు ఎగరవేసి మిఠాయిలు పంచిపెట్టారు. తెలంగాణను సాధించిన అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**రాచూర్ గ్రామంలో ..**

వెల్దండ మండల పరిధిలోని రాచూరు గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ జెండాను సింగల్ విండో డైరెక్టర్ షాంపూరి రాఘవేందర్ రెడ్డి ఆవిష్క రించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో గ్రామంలో బీఆర్ ఎస్ జెండా ఎగరవేస్తామని అన్నారు.ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ పర్వతాలు, మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ గుత్తి జంగయ్య, సీనియర్ నాయకులు రాధా కిషన్ గౌడ్, తాజుద్దీన్, గోకమల్ల రాజు, గుత్తి బాలకృష్ణ, హనుమంత రెడ్డి, రాములు, నరేష్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**నూతన జోస్‌తో.. తరలిన అభిమానులు**

**అచ్చంపేట :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ సాధించిన ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ చేసుకునే సందర్భంలో వరంగల్ వేదికగా ఆదివారం జరగనున్న రజతోత్సవ జాతరకు నల్లమల నడుం కట్టింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలి వెళ్లారు. గ్రామాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. 40 బస్సులు, క్రూజర్లు, జీపులు, సొంత వాహనాలలో దాదాపు ఐదువేల నుంచి 7వేల వరకు తరలి వెళ్ళినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలవకుండా ఘట్కేసర్ వద్ద మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

**రెపరెపలాడిన గులాబీ జెండా..**

**అచ్చంపేట రూరల్ :** ఆదివారం గులాబీ జెండా రెపరెపలాడింది. బీఆర్ఎస్ ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తి చేసుకొని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మండలంలోని 38 గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు బీఆర్ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో రజతోత్సవ మహాసభకు పల్లె పల్లె నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

దారులన్నీ వరంగల్ ఎల్కతుర్తి వైపే

బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఆదివారం ఉదయం జడ్చర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమంది పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు వరంగల్ సభకు తరలి వెళ్లారు.

## అర్థరహితంగా కాంగ్రెస్ పథకాలు..
## బీఆర్ఎస్ వైపు చూస్తున్న జనాలు
## మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**భూత్పూర్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతతో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ ఎల్కతుర్తి లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు భూత్పూర్ పట్టణ కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటలకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భూత్పూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమ చేస్తున్న సంక్షేమ పథకాలు అర్థరహితంగా ఉన్నాయని ఆరోపిస్తూ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ సమయంలో 14 ఏళ్లు చేసిన పోరాటాన్ని, అధికారంలో పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన వ్యవహారాన్ని, ఏడాదిన్నరగా ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలబడిన తీరును ప్రజలు ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. ఎల్కతుర్తి లో నిర్వహిస్తున్న సభకు ప్రజలు అనుకున్న దానికంటే రెండింతలుగా ముందుకు రావడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజల్లో కేసీఆర్ సార్ చూడాలని, ఆయన స్పీచ్ ను వినాలని ఎంతోమంది ఆశతో ఈ సభకు తరలి వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీపీలు సత్తూర్ చంద్రశేఖర్ గౌడ్, రాచూరి చంద్రమౌళి, మాజీ సర్పంచులు సత్తూర్ నారాయణ గౌడ్, నర్సింలు గౌడ్, మనమోని సత్యనారాయణ, వెంకటయ్య, ఫసియోద్దీన్, బీఆర్ఎస్ మండల నాయకులు సాయిలు, వెంకట రాములు, నరసింహారెడ్డి, ఆల శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి
## శాంతిని నెలకొల్పాలి : ప్రజా సంఘాలు

**నల్లగొండ :** ఛత్తీస్‌గఢ్ కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను ఆపివేసి, శాంతిని నెలకొల్పాలని వామపక్ష పార్టీల నాయకులు, సామాజిక ప్రజా సంఘాల నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బలగాలను వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ మారణకాండకు వ్యతిరేకంగా స్థానిక నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, సిపి(ఐ)ఎం పార్టీ ప్రతినిధి చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పనిగట్టుకొని హింసకు తెరలేపడం సరైంది కాదన్నారు. ఈ దేశంలోని అడవులలో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆదివాసులను అంతం చేయడానికి పూనుకున్నదని విమర్శించారు. అడవులను కాపాడుతున్న ఆదివాసీలను ఏరివేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. దేశ సంపదను కాపాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు దుర్మార్గమన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడగు నాగార్జున మాట్లాడుతూ మేధావులు, బుద్ధి జీవుల సూచన మేరకు సాయిధ పోరాటాన్ని ఎంచుకున్న మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అయినా కూడా గత కొన్ని మాసాలుగా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను వెచ్చించి నరమేధాన్ని సృష్టిస్తుందని విమర్శించారు. ఆదివాసీల జీవించే హక్కును హననం చేసే అధికారం కేంద్రానికి లేదన్నారు. రాజ్యాంగానికి లోబడి తక్షణమే శాంతి చర్చలు ప్రారంభించాలని, ఆదివాసీ హక్కులను కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధినేత అయిన రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని ఆ రాజ్యాంగంలో ప్రస్తావించబడిన ఆదివాసీ హక్కులను కాపాడే దిశగా తమ గొంతును విప్పాలని డిమాండ్ చేశారు.

# కొను'గోడు' పట్టదా?

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల్లేక రైతుల అవస్థలు**
**రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉన్నా కాంటా వేయని నిర్వాహకులు**
**క్వింటాల్‌కు 5 కేజీలు తరుగు తీస్తామంటున్న మిల్లర్లు**
**ధాన్యం తరలించేందుకు లారీల కొరతతో ఇక్కట్లు**
**మారుతున్న వాతావరణ పరిస్థితులతో అన్నదాతల్లో ఆందోళన**



**ఖమ్మం :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు కొనుగోళ్లు జరగక, మరోవైపు వాన భయం, ఇంకోవైపు అసౌకర్యాలు వెరసి రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కంటిమీద కును కు లేకుండా పోయింది. అయినా వీరి గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఖమ్మం జిల్లాలో యాసంగిలో పండించిన సన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రా ల్లో అమ్మకోవడానికి వచ్చిన రైతులకు షాక్ తగులు తోంది. ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా నిర్వాహకులు కాంటాలు పెట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో రైతులకు పడిగాపులు తప్ప డం లేదు. క్వింటాకు 5 కేజీల వరకు తరుగు తీస్తేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. రైతులు ఈ షరతుకు ఒప్పుకోకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు కాంటాలు వేయడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు వీల్లేక, అకాల వర్షాలకు తడుస్తుండటంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

**ఏడు చేపల కథ..**

చేపా..చేపా ఎందుకు ఎండలేదంటే.. గడ్డి మోపు అడ్డమొచ్చిందన్న చందంగా ఉంది కొనుగోలు కేంద్రాల తీరు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ధాన్యం కాంటా వేయడం లేదు. ఎందుకు వేయడం లేదంటే లారీలు వస్తేనే కాంటా వేస్తామంటున్నారు. లారీలు ఎందుకు సరఫరా చేయడం లేదని సప్లయర్స్‌ను అడిగితే లోడింగ్, అన్‌లోడింగ్ వెంటనే చేస్తేనే లారీలు పెడతామంటున్నారు. అన్‌లోడింగ్ వెంటనే చేయమని మిల్లర్లను అడిగితే క్వింటాకు 5 కేజీల తరుగు తీస్తేనే దిగుమతి చేసుకుంటామంటున్నారు. ఇలా ఒకదానికి ఒకటి లింక్ పెట్టి రైతులతో ఆడుకుంటున్నారు.

**ప్రైవేట్ వ్యాపారుల వైపే..**

కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.2,100 కు కొనుగోలు చేస్తుండగా, ఆ మొత్తానికే విక్రయిస్తున్నారు. తద్వారా అటు మద్దతు ధర, ఇటు బోనస్ కోల్పోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే ఓపిక లేక అమ్ముకుంటున్నారు.

అసౌకర్యాల నడుమ..

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఏ కేంద్రంలోనూ రైతులకు సౌకర్యాలు లేవు.

' ఓ టెంట్ ఏర్పాటు చేశారు. ఈ టెంట్ కింద ధాన్యం కొనుగోలు చేసే వీఓ గ్రూప్ సభ్యులు, ఐకేపీ సీసీలు రెండు మూడు కుర్చీలు వేసుకొని కూర్చుంటున్నారు.

' ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. ధాన్యం మీద కప్పుకోవడానికి రైతులే రూ.10 వేలు విలువ చేసే పట్టాలు కొనుగోలు చేస్తున్నారు. ఐకేపీ నుంచి ఎలాంటి టార్పాలిన్లు ఇవ్వడం లేదు.

' రైతులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారే క్యాన్లు వెంట తెచ్చుకుంటున్నారు.

' ధాన్యం తూర్పార పట్టడానికి మాత్రం ఓ ఫ్యాన్ ఏర్పాటు చేస్తున్నారు. దానిని నడిపించడానికి ట్రాక్టర్‌ను రైతులే తెచ్చుకోవాలి.

' కొనుగోలు చేసిన తర్వాత లారీలోకి ఎక్కించి మిల్లుకు తరలించడానికి వారం పట్టినా, పది రోజులైనా ధాన్యం జాగ్రత్త బాధ్యతలు రైతులవే. ఒకవేళ వాన పడితే ఇబ్బందే.

' కొణిజర్ల మండల రైతులు సాగు చేసిన యాసంగి పంటను ముదిగొండ మండలంలోని ఓ రైస్ మిల్లు కు, సత్తుపల్లి శివారులోని మరో రైస్ మిల్లుకు కేటాయించారు. సత్తుపల్లి మిల్లర్ తమ వద్ద బాయిలర్ రిపేర్‌కు వచ్చిందని కొనుగోలు నిలిపేశాడు.

' ముదిగొండ సమీపంలోని రైస్ మిల్లు యజమాని నేరుగా రైతులతో మాట్లాడుకొని ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా ఇస్తానంటే లారీ దిగుమతి చేసుకుంటున్నాడు. లేదంటే అంతే. ప్రస్తుతం నాలుగు రోజులుగా మల్లుపల్లికి చెందిన ఓ లారీ ఆ మిల్లు వద్దే ఉంది.

' నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామ శివారులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 30 వేల బస్తాల ధాన్యం తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించారు. మరో 10 వేల బస్తాలు తూకం వేయాల్సి ఉంది. నాలుగైదు రోజుల క్రితం తూకం వేసిన 1,800 బస్తాలు వరకు కొనుగోలు కేంద్రంలో ఉన్నాయి. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోంది.

' సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం కాంటా నిలిచిపోయినట్టు రైతులు పేర్కొన్నారు.

' యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేదతీరడానికి నీడ లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్ కవర్లతో వేసిన గుడిసె.. మంచినీటి డ్రమ్ములు పెట్టడానికి రికార్డులు రాసుకోవడానికి మాత్రమే సరిపోతుంది. రైతులు, కూలీలు సమీపంలో కంపచెట్ల కింద చాలీచాలని నీడన అలసట తీర్చుకుంటున్నారు.



# పిల్లలకు టీ ఇస్తున్నారా..

కొన్ని ఇళ్లల్లో పెద్దవారితో పాటు పిల్లలకు కూడా టీ తాగే అలవాటు ఉంటుంది. ముఖ్యంగా 12 ఏళ్లలోపు పిల్లలకు టీ తాగే అలవాటు ఉంటే అది వారి శారీరక నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. పిల్లలకు ఈ అలవాటు ఉంటే ఎలాంటి సమస్యలు వస్తాయి. భారతదేశంలో టీ అత్యంత ప్రజాదరణ పొందిన డ్రింక్. ఇది రోజువారీ జీవనంలో ఒక భాగం. ఉదయం ఒక కప్పు టీతో ప్రారంభించడం చాలా మంది అలవాటుగా మారింది. అయితే, పిల్లలకు టీ ఇవ్వడం సురక్షితమేనా అనే ప్రశ్న తల్లిదండ్రులను తరచూ ఆలోచనలో పడేస్తుంది. టీలోని కెఫీన్, టానిన్స్, చక్కెర వంటి భాగాలు పిల్లల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? పిల్లలకు టీ ఇచ్చే తల్లిదండ్రులు తెలుసుకోవలసిన ముఖ్యమైన సమాచారాన్ని, నిపుణుల సలహాలతో సహా వివరంగా తెలుసుకుందాం.. టీలో కెఫీన్, టానిన్స్, ఇతర సమ్మేళనాలు ఉంటాయి, ఇవి పెద్దలకు లాభదాయకంగా ఉన్నప్పటికీ, పిల్లలకు హానికరంగా ఉండవచ్చు. ఒక సాధారణ కప్పు టీ (240 మి.లీ.)లో 15-70 మి.గ్రా. కెఫీన్ ఉంటుంది, ఇది పిల్లల నాడీ వ్యవస్థను ప్రభావితం చేసి నిద్రలేమి, ఆందోళన, లేదా హృదయ స్పందన రేటు పెరగడం వంటి సమస్యలను కలిగిస్తుంది. అదేవిధంగా, టీలోని టానిన్స్ శరీరంలో ఐరన్ శోషణను తగ్గిస్తాయి, ఇది రక్తహీనతకు దారితీస్తుంది. చాలా మంది టీలో చక్కెర లేదా తేనె జోడిస్తారు, ఇది పిల్లలలో ఊబకాయం, దంత సమస్యలు, మరియు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. టీ తాగడం వల్ల పిల్లలలో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కెఫీన్ వల్ల నిద్ర భంగం ఏర్పడవచ్చు, ఇది పిల్లల ఏకాగ్రత, అభ్యాస సామర్థ్యం, మరియు మొత్తం అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. టానిన్స్ ఐరన్ శోషణను అడ్డుకోవడం వల్ల పోషకాహార లోపం సంభవించవచ్చు, ఇది పిల్లల పెరుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. అధిక చక్కెర వినియోగం బరువు పెరగడానికి, దంత క్షయానికి దారితీస్తుంది. అంతేకాకుండా, టీ ఆమ్ల స్వభావం కొంతమంది పిల్లలలో జీర్ణ సమస్యలు లేదా కడుపు నొప్పిని కలిగించవచ్చు. నిపుణులు పిల్లలకు టీ ఇవ్వడం గురించి స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు టీ ఇవ్వకపోవడం మంచిది. ఎందుకంటే ఈ వయస్సులో కెఫీన్ సున్నితమైన శరీరాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ప్రకారం, 12-18 సంవత్సరాల పిల్లలు రోజుకు 100 మి.గ్రా. కంటే తక్కువ కెఫీన్ తీసుకోవాలి. కానీ ఒక కప్పు టీ ఈ పరిమితిని సులభంగా దాటవచ్చు. టీ ఇవ్వాలనుకుంటే, రోజుకు ఒక చిన్న కప్పు (100-150 మి.లీ.) మాత్రమే, అది కూడా తక్కువ చక్కెరతో లేదా చక్కెర లేకుండా ఇవ్వాలి. సాయంత్రం లేదా రాత్రి సమయంలో తాగకుండా చూసుకోవాలి. ఇది వారి నిద్రను డిస్టర్బ్ చేస్తుంది.

పిల్లలకు టీ బదులు ఆరోగ్యకరమైన సురక్షితమైన పానీయాలను అందించడం మంచిది. కెఫీన్ లేని హెర్బల్ టీలు, అంటే చమోమైల్, పిప్పరమింట్, లేదా రూయిబోస్ టీలు, జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు సురక్షితమైన ఎంపికలు. తాజా పండ్ల రసాలు లేదా చక్కెర రహిత స్మూతీలు పోషకాలను అందిస్తాయి, ఇవి పిల్లల పెరుగుదలకు ఉపయోగపడతాయి. పాలు లేదా బాదం పాలు కాల్షియం విటమిన్ డి వంటి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అన్నింటికంటే, సాదా నీరు లేదా నిమ్మ, కీర ముక్కలు వేసి ఇచ్చే నీరు హైడ్రేషన్‌కు మంచిది. పిల్లలకు టీ ఇవ్వాలని నిర్ణయించుకుంటే, కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. టీని ఎక్కువ నీటితో తయారు చేయాలి, దీనివల్ల కెఫీన్ టానిన్స్ స్థాయిలు తగ్గుతాయి. చక్కెర లేదా తేనెను పూర్తిగా నివారించడం లేదా చాలా తక్కువగా ఉపయోగించడం మంచిది. టీని భోజన సమయంలో ఇవ్వడం మానుకోవాలి, ఎందుకంటే ఇది ఐరన్ శోషణను తగ్గిస్తుంది. భోజనానికి ఒక గంట ముందు లేదా తర్వాత ఇవ్వడం ఉత్తమం. టీ తాగిన తర్వాత పిల్లలలో ఆందోళన, నిద్రలేమి, లేదా కడుపు సమస్యలు కనిపిస్తే, వెంటనే దానిని ఆపివేసి వైద్యుడిని సంప్రదించాలి.

# పిల్లలు మరీ ఎక్కువ అల్లరి చేస్తున్నారా..?




పిల్లలు హైపర్‌గా ఉండటం చాలా సాధారణం. అయితే వారు ప్రశాంతంగా ఉండాలంటే మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి. రోజు ఏం చేయాలో ఒక టైమ్ టేబుల్ వేయాలి, ఆడుకోవడానికి పంపాలి, బుద్ధిగా ఉండే ఆటలు ఆడించాలి. ఇలా చేస్తే పిల్లలు మెల్లగా కంట్రోల్ లోకి వస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటారు. పిల్లలు ప్రశాంతంగా, మంచిగా పెరగాలనే ఆశతో అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ పిల్లలు ఒకే విధంగా ఉండరు. కొందరు పిల్లలు ఎంతో చురుకుగా, ఎనర్జీతో ఉంటారు. వీరిని నియంత్రించడం కొంత కష్టం అనిపించవచ్చు. అయితే చిన్న చిన్న మార్పులతో సరైన దృష్టితో వారిని సులభంగా శాంతపరచవచ్చు. పిల్లలు హైపర్‌గా ఉంటే వారి కోసం స్పష్టమైన దినచర్య ఉండాలి. ఉదయం లేచే సమయం, చదువుకునే సమయం, ఆడుకునే సమయం, తినే సమయం, నిద్రించే సమయం ఇలా స్పష్టంగా నిర్ణయించాలి. ఇలా చేస్తే పిల్లల ఎనర్జీ నిర్దిష్టమైన కార్యకలాపాల్లో దారి మళ్లుతుంది. అలాగే వారికీ ఒక రొటీన్ ఏర్పడుతుంది. పిల్లలు ప్రశాంతంగా ఉండకపోయినా మనం అసహనం చూపకూడదు. చిన్నపిల్లలు ఎక్కువగా చురుకుగా ఉండే అవకాశం ఉంది. అలా ఉంటున్నారని వారిపై కోపం తెచ్చుకోకండి. కోప్పడితే వారు ఇంకా అసహనంగా మారుతారు. బదులుగా వారు ఎలా ప్రవర్తిస్తున్నారో అర్థం చేసుకుని ఓపికగా స్పందించండి.హైపర్ పిల్లలకు ఎక్కువగా ఎనర్జీ ఉంటుంది. ఆ ఎనర్జీ సరైన దిశలో పోనిస్తే వారిలో ఒత్తిడి తగ్గుతుంది. రోజువారీ క్రీడలు, నృత్యం, ఈత వంటి శారీరక పనులు చేయమని ప్రోత్సహించండి. స్కూల్ తర్వాత పిల్లలు ఆటలు ఆడితే మంచి ప్రయోజనం ఉంటుంది. ఇలా చేయడం వల్ల వారు రాత్రికి ప్రశాంతంగా నిద్రిస్తారు. చిన్నపిల్లల దృష్టి ఒకే పని మీద నిలబడడం కొంచెం కష్టం. అందుకే దృష్టిని పెంపొందించే ఆటలు లేదా పనులను ఎన్నుకోవాలి. ఉదాహరణకు పజిల్స్, బొమ్మలు గీయడం, చిన్న చిన్న హస్తకళలు. ఇవి వాళ్ల దృష్టిని ఒకేచోట నిలబెట్టడమే కాక వారిని మైండ్‌ఫుల్‌గా మారుస్తాయి. మీ పిల్లలు హైపర్ యాక్టివ్‌గా ఉంటే భయపడకండి. వారు సాధారణంగా ఎక్కువ ఉత్సాహంగా ఉంటారు. కొన్ని చిన్న సర్దుబాట్లతో వారిని శాంతపరచడం పెద్ద కష్టమేమీ కాదు. తల్లిదండ్రుల ఓర్పు, ప్రేమ, వారి రోజువారీ కార్యకలాపాలను ఒక క్రమ పద్ధతిలో నిర్వహించడం పిల్లల ప్రవర్తనను మెరుగుపరచడంలో చాలా ముఖ్యమైనవి. ఇలాంటి చిట్కాలతో మీరు మీ పిల్లల్ని ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఎదిగేలా చేయొచ్చు.

# ప్రాణాయామాలు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి!

వేసవిలో ఆరోగ్యంగా ఉండేందుకు తినే ఆహారంతో పాటు శారీరక శ్రమ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా శరీరం చల్లగా ఉండేందుకు కొన్ని ప్రాణాయామాలు మంచి సహాయకారి. ఈ సీజన్‌లో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 15 నిమిషాలు మూడు రకాల ప్రాణాయామం చేయడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. అంతేకాదు అనేక విధాలుగా ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెప్పారు. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ వాతావరణంలోని వేడి, తేమ పెరుగుతాయి. దీంతో ఈ సమయంలో డీహైడ్రేషన్ సమస్యతో ఇబ్బంది పడడం సర్వ సాధారణం. అందుకనే వేసవి కాలంలో తినే ఆహారంతో పాటు సహజమైన పానీయాలు తీసుకోవడం మంచిది. ఇది శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. అదేవిధంగా కొన్ని యోగా ఆసనాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. శక్తిని కాపాడుతాయి. యోగా మిమ్మల్ని శారీరకంగా దృఢంగా ఉంచడమే కాదు మానసిక ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అందువల్ల వేడి వల్ల కలిగే నీరసాన్ని, చిరాకును తగ్గించడానికి యోగా చేయవచ్చు. వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో కొన్ని ప్రాణాయామాలు సహాయపడతాయి. వీటిని చేయడం చాలా సులభం. కనుక మీరు ప్రతి రోజూ ఉదయం కొన్ని నిమిషాలు కేటాయించి చేయవచ్చు. చంద్రభేది ప్రాణాయామం: వేసవి కాలంలో చంద్రభేది ప్రాణాయామం చేయడం చాలా ప్రయోజనకరం. ఒత్తిడిని తగ్గించడం , శరీరాన్ని చల్లబరచడమేకాదు ఇది అధిక రక్తపోటుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనిని ప్రతి ఉదయం చేయవచ్చు. ఈ ప్రాణాయామం చేయడానికి మొదట సుఖాసన స్థితిలోకి వచ్చి, తరువాత పద్మాసన స్థితిలోకి రావాలి. నిటారుగా కూర్చోవాలి. నడుము, మెడను నిటారుగా ఉంచండి. ఇప్పుడు మీ కుడి వైపు ముక్కును బొటనవేలితో నొక్కి, దీర్ఘమైన శ్వాస తీసుకొని కొన్ని సెకన్ల పాటు దానిని పట్టుకుని.. తర్వాత ముక్కుకి ఎడమ వైపు రంధ్రం నుంచి గాలిని వదిలివేయాలి. ఇలా మళ్ళీ మళ్ళీ చేయండి. ఈ సమయంలో శ్వాసపై దృష్టి పెట్టండి. సిత్కారి ప్రాణాయామం: శరీరాన్ని చల్లగా ఉంచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో, పిత్త దోషాన్ని నియంత్రించడంలో అలాగే అధిక రక్తపోటును నియంత్రించడంలో సిత్కారి ప్రాణాయామం సహాయపడుతుంది. ఈ ప్రాణాయామం చేయడానికి ముందుగా సౌకర్యవంతమైన స్థితిలో కూర్చోండి. నోరు తెరిచి, నాలుకను బయట ఉంచండి. నోటి ద్వారా గాలి పీల్చుకుని, ముక్కు ద్వారా గాలిని వదలండి. శీతలి ప్రాణాయామం: శీతలి ప్రాణాయామం వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో కూడా సహాయపడుతుంది. దీన్ని చేయడానికి.. బహిరంగ ప్రదేశంలో కూర్చోండి. నడుము, మెడను నిటారుగా ఉంచండి. కళ్ళు మూసుకుని నాలుకను చాపి నోటి ద్వారా గాలిని లోపలికి పీల్చుకోండి, ఆ తర్వాత ముక్కు ద్వారా గాలిని బయటకు వదలండి. అంటే కుడి ముక్కు రంధ్రాన్ని వేలితో మూసివేసి, ముక్కు ఎడమ వైపు నుండి గాలిని వదలండి. అదేవిధంగా రెండవ సారి, ఎడమ ముక్కు రంధ్రంపై వేలు ఉంచి, కుడి ముక్కు రంధ్రం నుంచి గాలిని విడిచి పెట్టండి. ఇలా 7 నుంచి 8 సార్లు చేయండి.





# ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినండి

ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఈ సాధారణ అలవాటు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, శరీరాన్ని శుద్ధి చేయడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. అంతేకాదు ఇది ఇమ్యూనిటీని బలోపేతం చేస్తుంది. కాలేయం, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. సాధారణంగా ఆరోగ్యాన్ని మెరుగుపర్చే అలవాట్లలో కొన్ని చాలా సులభం.. కానీ అవి చాలా ప్రాముఖ్యం కలిగినవి. బొప్పాయి తినడం కూడా అలాంటిదే. ఉదయం ఖాళీ కడుపుతో ఈ పండు తినడం శరీరానికి ఎంతో మంచిది. మీ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి శాస్త్రవేత్తలు కూడా దీనిని సిఫారసు చేస్తారు. ఇది గొప్ప ప్రయోజనాలను అందించగలదు. మీ శరీరం రాత్రిపూట విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు.. అది శుద్ధి చేయడం మొదలుపెడుతుంది. ఉదయానికి, వ్యర్థాలను బయటకు పంపడానికి సిద్ధంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం ఈ ప్రక్రియకు తోడ్పడుతుంది. బొప్పాయిలో ఉండే నీరు, పపాయన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియ మొదలవ్వడానికి సహాయపడతాయి. ఈ ఎంజైమ్ శరీరం వ్యర్థాలను తొలగించడానికి తోడ్పడుతుంది. కాబట్టి బొప్పాయి తినడం మీ జీర్ణక్రియను మొదలుపెట్టడానికి సహాయపడుతుంది. మీకు ఎప్పుడైనా భారంగా, కలతగా, అసౌకర్యంగా లేదా అనారోగ్యంగా అనిపించినట్లయితే బొప్పాయి మీకు సహాయం చేస్తుంది. బొప్పాయిలో ఉండే పపాయన్ అనే ఎంజైమ్ ప్రోటీన్లను విడగొట్టి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. ఇతర ఆహారాలు తీసుకోకముందే మీ జీర్ణకోశాన్ని సిద్ధం చేస్తుంది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది, అసిడిటీని కూడా తగ్గిస్తుంది.ఆరోగ్యకరమైన చర్మానికి జీర్ణక్రియ ముఖ్యం. బొప్పాయి విటమిన్ సి, బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. ఈ పోషకాలు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షిస్తాయి. రోజూ బొప్పాయి తీసుకోవడం వల్ల చర్మం మెరుగవుతుంది, మొటిమలు తగ్గుతాయి, చర్మం మరింత మృదువుగా తయారవుతుంది. బొప్పాయి లోని విటమిన్ ఎ శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. బొప్పాయి లో ఫోలేట్, పొటాషియం, ఫైబర్ లాంటి పోషకాలు ఉంటాయి. ఇవి రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే బొప్పాయి లోని యాంటీఆక్సిడెంట్లు వాపు తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కాలేయ పనితీరు మెరుగుపరచడంలో సహాయపడతాయి.బొప్పాయి స్వీట్ గా ఉన్నప్పటికీ, ఇది గ్లైసెమిక్ సూచికను ఎక్కువగా పెంచదు. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను హఠాత్తుగా పెంచదు. అంతేకాకుండా ఇది కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, ఆకలిని నియంత్రిస్తుంది. మీకు ఉదయం లేదా మధ్యాహ్నం ఆకలిగా అనిపిస్తే భోజనానికి మధ్యలో బొప్పాయి తీసుకోవడం మంచి ఎంపిక.కొన్ని రకాల పండ్లను ఖాళీ కడుపుతో తీసుకోవడం అంతగా మంచిది కానప్పటికీ బొప్పాయి మాత్రం ప్రత్యేకమైనది. ఇది జీర్ణక్రియకు సహజంగా, సున్నితంగా సహాయపడుతుంది. ఈ పండు ఎలాంటి నొప్పి లేదా అసౌకర్యం కలిగించకుండా జీర్ణక్రియను సాఫీగా చేస్తుంది. శరీరంపై ప్రతికూల ప్రభావం చూపకుండా తన ప్రయోజనాలను అందిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో ఒక కప్పు నిండుగా పండిన బొప్పాయి ముక్కలు తినండి. ఆ తర్వాత కనీసం 30 నిమిషాల వరకు ఏమీ తినకుండా వేచి ఉండండి. బొప్పాయి తాజాగా ఉండాలి, మరీ పచ్చిగా ఉండకూడదు. దీన్ని పాల ఉత్పత్తులతో లేదా పుల్లని పండ్లతో కలిపి తీసుకోకండి. సపరేట్ గా తినడం ఉత్తమం. ఈ అలవాటు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

బిజినెస్

# ప్రపంచంలోని 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు

భారత ఆర్థిక వ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇండియా.. జర్మనీ, జపాన్‌లను అధిగమించి ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని పలువురు నిపుణులు చెబుతూనే ఉన్నారు. భారతదేశం ప్రపంచానికి విద్యా కేంద్రంగా మారగలదని, మిగతావన్నీ పక్కన పెడితే మన దేశంలోని ప్రజాస్వామ్యమే మనకు అతిపెద్ద ప్రయోజనమని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం తన అభిప్రాయాన్ని ఇటీవలే వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదవ అతిపెద్దది. వచ్చే ఏడాది చివరి నాటికి మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండబోతున్నాము. ఆ తర్వాత ఏడాది మూడవ అతిపెద్దదిగా ఉంటామని ఆయన వివరించారు. ప్రపంచంలోని టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ %+ణూ%కి గణనీయంగా దోహదపడతాయి. అంతే కాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక విధానాలపై కూడా బలమైన ప్రభావాన్ని చూపుతాయి. వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదిక ప్రకారం.. టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇలా..

యునైటెడ్ స్టేట్స్ (యూఎస్): 30.507 ట్రిలియన్ డాలర్లు
చైనా: 19.231 ట్రిలియన్ డాలర్లు
జర్మనీ: 4.744 ట్రిలియన్ డాలర్లు
భారతదేశం: 4.187 ట్రిలియన్ డాలర్లు
జపాన్: 4.186 ట్రిలియన్ డాలర్లు



యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే): 3.839 ట్రిలియన్ డాలర్లు
ఫ్రాన్స్: 3.211 ట్రిలియన్ డాలర్లు
ఇటలీ: 2.422 ట్రిలియన్ డాలర్లు
కెనడా: 2.225 ట్రిలియన్ డాలర్లు
బ్రెజిల్: 2.125 ట్రిలియన్ డాలర్లు

## రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350 వచ్చేసింది!



భారత్‌కు చెందిన ప్రముఖ టూవీలర్ తయారీ కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ పాపులర్ మోడల్ అయిన హంటర్ 350 అప్‌డేట్ వెర్షన్‌ను భారత్‌లో రిలీజ్ చేసింది. ముంబయి, ఢిల్లీల్లో 'హంటర్స్‌హుడ్' ఫెస్టివిల్ నిర్వహించి.. హంటర్ 350 బైక్‌ని లాంచ్ చేసింది. ఈ బైక్ రియో వైట్, టోక్యో బ్లాక్, లండన్ రెడ్ రంగుల్లో అందుబాటులో ఉండనున్నది. పాత మోడల్‌తో పోలిస్తే ఇందులో పలు మార్పులు చేసింది. మెరుగైన రైడింగ్ కోసం ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, ట్రిప్పర్ నావిగేషన్ పాడ్, టైప్-సీ యూఎస్‌బీ సపోర్ట్ అందించింది. గ్రౌండ్ క్లియరెన్స్‌ని 10 ఎంఎంకి పెంచింది. అలాగే, రియర్‌లో సస్పెన్షన్‌లో సైతం మార్పులు చేసింది. దాంతో పాటు సీట్ కంఫర్ట్ ఉండేలా మార్పులు చేసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ 350సీసీ రేంజ్‌లో స్లిప్పర్-అసిస్ట్ క్లచ్ ఉన్న తొలి బైక్ ఇదే కావడం విశేషం. అయితే, కంపెనీ ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లోని 349సీసీ, ఎయిర్-ఆయిల్ కూల్డ్, జే సిరీస్ ఇంజిన్‌ను యథాతథంగా కొనసాగించింది. ఈ బైక్ 5 స్పీడ్ గేర్‌బాక్స్‌తో రానున్నది. 20.2 బీహెచ్‌పీ పవర్ వద్ద 27 ఎన్ఎం టార్క్‌ని ఉత్పత్తి చేయనున్నది. ఇక ఈ బైక్ మూడు వేరియంట్లలో అందబాటులో ఉండనున్నది. ఫ్యాక్టరీ బ్లాక్ ధర రూ.1,49,900గా నిర్ణయించింది. రియో వైట్, డాపర్ గ్రే వేరియంట్ రూ.1,76,750కి అందుబాటులో ఉంటుంది. ఇక టోక్యో బ్లాక్, లండన్ రెడ్, రెబెల్ బ్లూ వేరియంట్ బైక్ రూ.1,81,750గా తెలిపింది. అయితే, ఇవన్నీ ఎక్స్‌షోరూం ధరలు (చెన్నై) మాత్రమే. ఈ హంటర్ 350 బైక్ కోసం రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్లతో పాటు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని.. త్వరలోనే బైక్‌ల డెలివరీలు ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది.

## రద్దయిన ప్లాంట్లకు దరఖాస్తులా?

'పీఎం కుసుమ్' పథకంపై సర్కారు నిర్లక్ష్యం ఫలితంగా 3 వేల మెగావాట్ల ప్లాంట్లు లాస్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): 'పీఎం కుసుమ్ పథకం కింద తెలంగాణకు 2024 జూన్‌లో 4 వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్లను మంజూరు చేశాం. ఎలాంటి పురోగతి లేకపోవడంతో 6 నెలల తర్వాత దీంట్లో 3,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను రద్దుచేశాం. 2025 ఫిబ్రవరిలో ప్రభుత్వ స్థలాల్లో మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటునుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. పీఎం కుసుమ్ పథకం ప్రత్యేకించి రైతుల కోసమే రూపొందించిన పథకం. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయొద్దు. రైతుల స్థలాల్లోనే ఏర్పాటు చేయాలని తెలంగాణకు సూచిం చాం' అని కేంద్ర ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల వ్యాఖ్యానించారు. కానీ రద్దయిన ప్లాంట్ల ఏర్పాటుకు సైతం తెలంగాణ రెడ్‌కో సంస్థ రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ప్లాంట్ల ఏర్పాటునకు సంబంధించి రైతులు, కంపెనీల నుంచి డీడీలను కూడా పొందింది. ఈ వ్యవహారంపై విద్యుత్తురంగ నిపుణులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. తొలుత పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో 4,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యువబుల్ ఎనర్జీ) 2024 జూన్‌లో అనుమతి ఇచ్చింది.

# అలాంటి బ్యాంక్ అకౌంట్స్ వెంటనే క్లోజ్ చేసుకోండి




సాధారణంగా చాలా మందికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్స్ ఉంటాయి. అయితే.. అందులో ఒకటి లేదా రెండు మాత్రమే ఉపయోగిస్తుంటారు. మిగిలినవన్నీ వృథా అన్న మాట. ఇలా వదిలేయడం వల్ల.. కొన్ని నష్టాలు భరించాల్సి ఉంటుంది. ఈ కథనంలో అలాంటి నష్టాలేమిటో తెలుసుకుందాం..

**బ్యాంక్ చార్జీలు**

ఒక బ్యాంకులో అకౌంట్ ఉందంటే.. అందులో మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేయాల్సిందే. ఒకవేళా మినిమమ్ బ్యాలెన్స్ లేకుండా ఉంటే.. వాటిపై బ్యాంక్ చార్జీలు వసూలు చేస్తుంది. కొన్ని సార్లు మైనస్ బ్యాలెన్స్‌లోకి కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. ఆ తరువాత లావాదేవీలు చేయాలంటే.. ముందు మైనస్ బ్యాలెన్స్ క్లియర్ చేయాల్సిందే.

**డబ్బు వృథా**

బ్యాంక్ అకౌంట్ ఉపయోగించకుండా.. అలాగే వదిలేస్తే అందులో ఉన్న మినిమమ్ బ్యాలెన్స్ వంటివి వృథా అవుతాయి. మీకు ఓ ఐదు అకౌంట్స్ ఉన్నాయనుకుంటే.. అందులో మీరు కేవలం ఒకదాన్ని మాత్రం వాడుతూ.. మిగిలినవి ఉపయోగించకుండా వదిలేస్తే అందులో ఉన్న డబ్బు వృథా అయినట్టే. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఎక్కువ అకౌంట్స్ మెయింటెన్సన్ చేయకుండా ఉండటమే ఉత్తమం.

**మోసాలకు అవకాశం**

టెక్నాలజీ పెరుగుతున్న సమయంలో మోసాలు ఎక్కువవుతున్నాయి. మీరు ఉపయోగించకుండా ఉంటే.. అలాంటి అకౌంట్లను కొందరు సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఇవి మిమ్మల్ని చిక్కుల్లో పడేసే అవకాశం ఉంది. కాబట్టి బ్యాంక్ అకౌంట్ వృథాగా ఉన్నా.. అప్పుడప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. లేదా క్లోజ్ చేసుకోవడం మంచిది.

**సిబిల్ స్కోరుపై ప్రభావం**

బ్యాంక్ అకౌంట్ యాక్టివ్‌గా లేకుంటే.. మైనస్ బ్యాలెన్స్‌లోకి వెళ్ళిపోతుంది. అంటే దీనర్థం మీరు బ్యాంకుకు అప్పు ఉన్నారన్నమాట. ఇది మీ క్రెడిట్ స్కోర్ మీద ప్రభావం చూపిస్తుంది. దీంతో సిబల్ స్కోర్ తగ్గిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే.. యాక్టివ్‌గా ఉన్న అకౌంట్స్ కాకుండా.. మిగిలినవన్నీ వెంటనే క్లోజ్ చేసుకోవాలి.

స్పోర్ట్స్

# ఒలింపిక్స్ కోసం క్రికెట్ జట్టు..
# పసిడి పతకంపై కన్నేసిన చైనా!

ఒలింపిక్స్‌లో వందలకొద్దీ పతకాలు కొల్లగొట్టే దేశాలు చాలానే. అథ్లెటిక్స్ నుంచి టేబుల్ టెన్నిస్ వరకూ ప్రతి పోటీలో స్వర్ణం సాధించే ఆసియా దేశం చైనా ఈసారి క్రికెట్ మీద గురి పెట్టింది. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగబోయే విశ్వక్రీడల్లో ఏకంగా పసిడి పతకంమే లక్ష్యంగా పెట్టుకుందట చైనా. అందుకోసం క్రికెట్ టీమ్‌ను సిద్ధం చేస్తోంట. ఈ విషయాన్ని ఆదివారం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా వెల్లడించాడు. 'దాదాపు శతాబ్దం తర్వాత క్రికెట్‌కు మళ్లీ ఒలింపిక్స్‌లో చోటు దక్కనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించడమే ఆలస్యం అన్ని దేశాలు సన్నాహాల్లో మునిగిపోయాయి. ఆసియా దేశం చైనా కూడా క్రికెట్ టీమ్‌ను సిద్ధం చేసుకుంటోంది. ఈరోజుల్లో టీ20లకు ఆదరణ చాలా ఉంది. ఫ్రాంచైజ్ క్రికెట్ ద్వారా ఏటా వందల కోట్ల వ్యాపారం సాగుతోంది. ఈ టీ20 బిజినెస్ మరింత పెరగనుంది' అని స్టీవ్ వా తెలిపాడు.

**ఆరేసి జట్లు**

విశ్వక్రీడల్లో 128 ఏళ్ల తర్వాత క్రికెట్ పునరాగమనం చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా హిట్ అయిన టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగంలో ఆరేసి జట్లు స్వర్ణం కోసం పోటీపడనున్నాయి. దాంతో, అన్ని దేశాలు ఒలింపిక్ పతకంపై కోసం సన్నద్ధమవుతున్నాయి. ఒలింపిక్స్‌లో ప్రతి పోటీలో పతకాల పంట పండించే చైనా.. క్రికెట్ టీమ్‌తో గోల్డ్ మెడల్ సాధిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. 2028లో జూలై 14న లాస్ ఏంజెల్స్‌లో ఒలిపింక్స్ పండుగ మొదలవ్వనుంది.




## శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా..



శ్రీలంక వేదికగా జరుగుతున్న మహిళల ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. ఇండియన్ స్పిన్నర్ స్నేహ్ రాణా మూడు వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించింది. ఆమెతో పాటు దీప్తి శర్మ, నల్లపు రెడ్డి చరణి తలా రెండు వికెట్లు సాధించారు. లంక బ్యాటర్లలో హసనీ పెరీరా(30) టాప్ స్కోరర్‌గా నిలవగా.. కవిషా దిల్హారి(25), సంజీవనీ(22) రాణించారు. కెప్టెన్ ఆతపట్టు(7)తో సహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. అనంతరం 148 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 29.4 ఓవర్లలో చేధించింది. భారత బ్యాటర్లలో ప్రతీక రావల్(50 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరవగా.. మంధాన(43), డియోల్(48 నాటౌట్) రాణించారు. శ్రీలంక బౌలర్లలో రణవీర ఒక్క వికెట్ సాధించారు. టీమిండియా తమ తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 29న కొలంబో వేదికగా దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

## ముంబై ఓపెనర్ విధ్వంసం.. ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ

ఐపీఎల్-2025లో వాంఖడే స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ రికెల్టన్ విధ్వంసం సృష్టించాడు. రికెల్టన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ దక్షిణాఫ్రికా బ్యాటర్ క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో రికెల్టన్ కేవలం 25 బంతుల్లోనే తన రెండో ఐపీఎల్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 32 బంతులు ఎదుర్కొన్న రికెల్టన్.. 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే అద్భుతమైన హాఫ్ సెంచరీతో మెరిసిన రికెల్టన్ ఓ రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికెల్టన్ రికార్డులకెక్కాడు. ఇంతకుముందు ఈ రికార్డు తిలక్ వర్మ పేరిట ఉండేది. ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో వర్మ కేవలం 26 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. తాజా మ్యాచ్‌తో వర్మను రికెల్టన్ అధిగమించాడు. ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో రికెల్టన్(58), సూర్యకుమార్ యాదవ్(54) హాఫ్ సెంచరీలతో మెరవగా.. నమన్ ధీర్(25), జాక్స్(29), బాష్(20) రాణించారు. లక్నో బౌలర్లలో మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు.





# హిట్ డైరెక్టర్‌తో నాగార్జున కొత్త సినిమా

'నా సామిరంగ' సినిమా తర్వాత నాగార్జున హీరోగా నటించనున్న చిత్రంపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదు. గత ఏడాది సంక్రాంతికి (జనవరి 14) విడుదలైన 'నా సామిరంగ' చిత్రం హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం నాగార్జున హీరోగా ఏ సినిమానూ సెట్స్‌లో లేదు కానీ, రజనీకాంత్ 'కూలీ' చిత్రంతో పాటు ధనుష్‌తో కలిసి 'కుబేర' సినిమాలో నటిస్తున్నారు. కాగా సోలో హీరోగా చేసేందుకు పలువురు దర్శకులు చెప్పిన కథలు విన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ పచ్చజెండా ఊపలేదు ఆయన. ఇదిలా ఉంటే... 'హిట్, హిట్ 2, సైంధవ్' తదితర చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో నాగార్జున ఓ సినిమా చేయనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుందని భోగట్టా. గతంలో నాగార్జునకి వినిపించిన ఓ కథకి మరిన్ని మార్పులూ చేర్పులూ చేసి, తాజాగా ఫైనల్ స్క్రిప్ట్‌ని వినిపించారట శైలేష్. ఈ కథ నాగార్జునకి నచ్చడంతో ఓకే చెప్పారట. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఓ హత్య ఘటన నేపథ్యంలో ఈ కథ సాగుతుందని టాక్. నాగార్జున పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండేలా శైలేష్ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరి... నాగార్జున సోలో హీరోగా తెరకెక్కనున్న చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తారా? అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఇక నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' మే 1న విడుదల కానుంది.

# ఈడీ అధికారులకు నటుడు మహేశ్ బాబు లేఖ



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు నేడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు డుమ్మాకొట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సాయి సూర్య డెవలపర్స్ అనే కంపెనీకి మహేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించినందుకు గాను ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. నోటీసుల ప్రకారం, మహేశ్ బాబు ఈరోజు ఉదయం 10:30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, నిర్ణీత సమయం ముగిసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాలేదు. ఇదిలావుంటే తాజాగా మహేశ్ బాబు ఈడీ విచారణకు హాజరుకాకపోయినందుకు లేఖ రాశాడు. ఈ లేఖలో ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండి విచారణకు హాజరుకాలేకపోయానని మహేశ్ వెల్లడించాడు. రేపు కూడా షూటింగ్ బిజీలో ఉండడంతో విచారణకు మరో తేదీని ఇవ్వాలని మహేశ్ లేఖలో కోరాడు. సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్ కంపెనీల ప్రమోషన్ కోసం మహేశ్ బాబు చెక్కుల రూపంలో రూ. 3.4 కోట్లు, నగదు రూపంలో రూ. 2.5 కోట్లు కలిపి మొత్తం రూ. 5.90 కోట్ల పారితోషికం తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ప్రభావితం చేశారని, ప్రమోషన్ల పేరుతో భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# శ్రీలీలకు బాలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్!

టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. పుష్ప 2లోని కిస్సిక్ పాటకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌తో ఆమెకు బాలీవుడ్‌లో అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే కార్తీక్ ఆర్యన్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్న శ్రీలీలకు తాజాగా మరో భారీ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. 'డ్రీమ్ గర్ల్' ఫేమ్ రాజ్ శాండిల్య దర్శకత్వంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం శ్రీలీల, అనన్య పాండేలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రధాన హీరోయిన్‌గా శ్రీలీలకే అవకాశం దక్కే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజ్ శాండిల్య కామెడీ చిత్రాలకు పేరుగాంచిన దర్శకుడు కావడంతో, ఈ చిత్రం కూడా అదే తరహాలో ఉండనుందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండనున్నారని టాక్. శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుసగా కనిపిస్తోంది. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి చేస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రం విడుదల కాకముందే మరో స్టార్ హీరోతో నటించే అవకాశం దక్కించుకోవడం విశేషం. ఇక టాలీవుడ్‌లోనూ శ్రీలీల బిజీగానే ఉంది. ప్రస్తుతం మాస్ మహారాజ రవితేజతో కలిసి 'మాస్ జాతర' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. దీంతో పాటు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు మరికొన్ని తెలుగు ప్రాజెక్టులు కూడా శ్రీలీల చేతిలో ఉన్నాయి. శ్రీలీల దూకుడు చూస్తుంటే, రష్మిక మందన్నలాగే ఆమె కూడా బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతుందో లేదో వేచి చూడాలి.






# మోహన్‌లాల్ కాదు... ఉపేంద్ర?

రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రంలో ఉపేంద్ర ఓ లీడ్ రోల్ చేయనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్ హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్య శ్రీ బోర్సే కనిపిస్తారు. కాగా.. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం మేకర్స్ మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల కుదరకపోవడంతో, కన్నడ స్టార్ ఉపేంద్రను సంప్రదించారట. ఈ పాత్ర చేసేందుకు ఉపేంద్ర సుముఖంగా ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఉపేంద్ర చేయనున్నది సినిమా హీరో క్యారెక్టర్ అని సమాచారం. మరి... రామ్ సినిమాలో సినిమా హీరోగా ఉపేంద్ర నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మే 15న రామ్ బర్త్ డేకి 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమా గురించిన అప్‌డేట్ రావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# ఏపీలో నాని 'హిట్-3' టికెట్ ధరల పెంపు.?



నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా టికెట్ ధరలను పెంచినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణలో టికెట్ ధరలకు అవకాశం లేకపోగా.. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమా టికెట్ రేట్లు పెంపునకు ప్రభుత్వం కూడా అనుమతినిచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ మూవీ టికెట్లను రూ.50 నుంచి రూ.75 వరకు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. కాగా దీనిపై చిత్రబృందంతో పాటు ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com